ప్రతిపక్షం
www.prathipaksham.in



ఇంకా భారత్‌కు అందని ఆసియా కప్ 8

సోమవారం 05.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 286 పేజీలు:8 | ₹5
@prathipaksham | prathipaksham tv telugu



"కృష్ణా నీటిలో తెలంగాణకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. మాకు అధికారం ముఖ్యం కాదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ముఖ్యం. అవసరమైతే మరో జల పోరాటానికి సిద్ధమవుతాం. అసెంబ్లీలో మాట్లాడుతూ దేవుడి మీద ప్రమాణం చేస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. గతంలో దేవుళ్ల మీద ప్రమాణం చేసి ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారు. దేవుళ్లనే మోసం చేసిన పాపాత్ముడు ఈయనే కదా?" అని హరీశ్ రావు అన్నారు.

పాలమూరుకు.. కాంగ్రెస్ మరణశాసనం

చీము, నెత్తురు ఉంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయాలి

- మాకు అధికారం కాదు... తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం
- కృష్ణా నీటిలో కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడతాం
- అవసరమైతే మరో జలపోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం
- రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల్లో అతి తక్కువ నీటి వినియోగం చేసిందే కాంగ్రెస్ పార్టీ
- 'నదీ జలాలు - కాంగ్రెస్ ద్రోహాలు" అంశంపై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: పాలమూరును వలసల జిల్లాగా మార్చింది కాంగ్రెస్‌పార్టీ, పాలమూరుకు మరణశాసనం రాసిందే కాంగ్రెస్‌పార్టీ అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తమకు అధికారం ముఖ్యం కాదు... తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని, కృష్ణా నీటిలో కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు .అవసరమైతే మరో జలపోరాటానికి బీఆర్ఎస్‌సిద్ధంగా ఉందన్నారు. చీము, నెత్తురు ఉంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల్లో అతి తక్కువ నీటి వినియోగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు అన్నారు. "నదీ జలాలు - కాంగ్రెస్ ద్రోహాలు" అనే అంశంపై తెలంగాణ భవన్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "మెడ మీద తలకాయ ఉన్న ఎవరూ, జూరాల నుంచి శ్రీశైలానికి సోర్స్ ఎందుకు మార్చారనే ప్రశ్న అడగరు. ఆంధ్ర వాళ్లకే శ్రీశైలం అప్పచెప్పాలన్న సమైక్య మైండ్ సెట్‌లో కాంగ్రెస్ పార్టీ వాళ్లున్నారు. జూరాల కింద 5.50 లక్షల ఎకరాల యాసంగి పంటకు క్రాప్ హాలిడే ప్రకటించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కానీ శ్రీశైలం మీదున్న కల్వకుర్తి మోటర్లు నడిపిస్తూ, కృష్ణా నదీ నీళ్లు

...:: మిగతా 2లో

11న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్?

2 వారాల్లో 125 మున్సిపాలిటీలకు ఎలక్షన్స్!




- రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా నిర్ణయం
- ఈ నెల 25వ తేదీ నాటికి ఎన్నికలు పూర్తయ్యే ఛాన్స్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మున్సిపాలిటీలకు ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెల 11వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం మెండుగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 125 మున్సిపాలిటీల్లో పాలక వర్గాల గడువు ముగియడంతో, అక్కడ వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. షెడ్యూల్ విడుదలైన నాటి నుండి కేవలం రెండు వారాల వ్యవధిలోనే పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల పై అధ్యయనం చేస్తున్న డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం ముందడుగు వేయనుంది. ఈ కమిషన్ నివేదిక అందిన వెంటనే ఏయే స్థానాలను ఏ వర్గాలకు కేటాయించాలో నిర్ణయిస్తారు. రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా రిజర్వేషన్లు కేటాయించడమే ఈ కమిషన్ ప్రధాన ఉద్దేశం. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే, ఈ నెల 25వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియను ముగించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ 11న నోటిఫికేషన్ వస్తే, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ మరియు ప్రచారానికి తక్కువ సమయం కేటాయించి, నెలాఖరులోపు కొత్త పాలక వర్గాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల స్థానిక సంస్థల్లో పాలన గాడిలో పడటమే కాకుండా, అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమై ఉంది.

హరీష్ రావు ప్రజెంటేషన్ బోగస్



- మీరు అధికారంలో ఉంటే ఆంధ్రోళ్ల నీళ్ల దోపిడీ గుర్తుకు రాదు
- ప్రతిపక్షంలో కూర్చోగానే మీకు ఆంధ్రోళ్ల నీటి దోపిడీ గుర్తుకొచ్చింది
- చంద్రబాబు హయాంలో కేసీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రోళ్ల పంచాయతీ లేదు
- సీఎం హోదాలో కేసీఆర్, చంద్రబాబు.. కేసీఆర్, జగన్ కలిస్తే తప్పలేదు
- రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి కలిస్తే తప్పా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పుదోవలో ఉందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల నిజమైన చరిత్ర ప్రజలకు తెలియజేయాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభలో కేసీఆర్, జగన్ ప్రభుత్వం ప్రతిపాదించిన అభివృద్ధి, నీటి ప్రాజెక్టులపై హరీష్ రావు చేసిన ప్రజెంటేషన్ బోగస్ అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. "రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రజెంటేషన్ సరిగా ఉన్నా, హరీష్‌రావు

...:: మిగతా 2లో

కృష్ణా నీళ్లతో రాజకీయం

- హరీష్ రావు నిర్ణయాలే పాలమూరుకు శాపం
- నీళ్ల వాటా తగ్గించి పవర్ పాయింట్‌లతో ప్రజలను మభ్యపెడుతున్నాడు
- అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వదిలి బయట డ్రామాలా?
- పాలమూరుకు అన్యాయం చేస్తే ప్రజలు క్షమించరు
- ప్రతిపక్షం లేకపోవటాన్ని ఆసరాగా చేసుకొని ప్రభుత్వం దోపిడీ
- తెలంగాణ నీళ్ల వాటా తగ్గించిన ఒప్పందంపై సంతకం చేసింది మీరు కాదా?
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిప్పులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్/ సూర్యాపేట, జనవరి 4: కృష్ణా నది నీళ్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట్-కొడంగల్ ప్రాజెక్టులకు కేటాయించిన నీళ్లను తగ్గిస్తూ తెలంగాణకు చారిత్రక నష్టం కలిగించారని, దీనిపై అసెంబ్లీలో చర్చ జరగకపోవటం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. కృష్ణా నది స్టేక్ హోల్డర్స్ అయిన నాలుగు రాష్ట్రాల ప్రయోజనాలను పట్టించుకోకుండా, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు, అప్పర్ భద్రకు జాతీయ హోదా వంటి కీలక అంశాలపై ప్రభుత్వం మౌనంగా ఉండటం భవిష్యత్ తరాల హక్కులను తాకట్టు పెట్టడమేనని ఆమె హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్,

...:: మిగతా 2లో





పోలవరం–నల్లమల్ల సాగర్‌పై

న్యాయ పోరాటం

- సీనియర్ న్యాయవాదులతో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కీలక భేటీ

గోదావరిపై ఏపీ ప్రభుత్వం చేపట్టిన పోలవరం–నల్లమల్ల సాగర్ (బనకచర్ల) విస్తరణ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

...:: 2లో

హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్లు?

గ్రేటర్ సైబరాబాద్, గ్రేటర్ మల్కాజిగిరి విభజన!

- ప్రస్తుతానికి పాలన స్టార్ట్
- బాధ్యతలపై అదనపు కమిషనర్లకు పూర్తి స్పష్టత
- అందుకు తగ్గట్లుగా జేసీ, ఏసీలు, సీసీపీల నియామకం
- కేటాయించిన జోన్లను చక్కదిద్దుకోవాలని సూచించిన కర్ణన్
- జోన్ల పరిపాలన, ఆర్థిక, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు ఉన్నతాధికారుల నియామకం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: గ్రేటర్ హైదరాబాద్‌మున్సిపల్‌కార్పొరేషన్ అధికారికంగా మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కాలేదు గానీ పరిపాలన మాత్రం ఆ మేరకు పట్టాలెక్కుతోంది. మూడు జోన్లకు ఓ అదనపు కమిషనర్ చొప్పున నియమించి అధికారులకు శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిపాలన బాధ్యతలపై స్పష్టమైన వివరాలను అందించారు. కేటాయించిన జోన్లకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలను

...:: మిగతా 2లో




ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వేగవంతం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును ప్రశ్నించిన అధికారులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 4: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు వేగాన్ని సిట్ అధికారులు పెంచారు. ఈ కేసులో ఎమ్మెల్సీ నవీన్ రావును ఆదివారం సిట్ అధికారులు విచారించారు. దాదాపు నాలుగు గంటలుగా ఆయన విచారణ కొనసాగింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక పరికరాలు (డివైజ్‌లు)లు ఉపయోగించి.. అప్పటి ప్రతిపక్షనేతలు, వారి కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించారంటూ నవీన్ రావుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీలోని పలువురి అగ్రనేతలతో నవీన్ రావుకు దగ్గర సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ ట్యాపింగ్ కేసులో గత ప్రభుత్వంలో ఎస్ఐబీ అధికారులను ఈ నవీన్ రావు ఎలా ఉపయోగించుకున్నారనే అంశంపై ఆయనను సిట్ అధికారుల బృందం ప్రశ్నించినట్లు సమాచారం. ఎక్కడెక్కడ పరికరాలు ఏర్పాటు చేసి.. ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడ్డారనే అంశంపై ఆయన నుంచి సిట్ అధికారులు కూపీ లాగుతున్నారు. అలాగే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు ఇదే కేసులో అరెస్టయిన మాజీ ఎస్ఐబీ అధికారులతో ఉన్న సంబంధాల గురించి నవీన్ రావు నుంచి సిట్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసుల బాధితులైన పలువురు రాజకీయ నేతల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి సారి నవీన్ రావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. నవీన్ రావు స్టేట్‌మెంట్ ఆధారంగా మరికొందరు బీఆర్ఎస్ ముఖ్య నేతలను సిట్ అధికారులను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



తమిళనాడులో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

దేశంలో గత రెండేండ్లలో బీజేపీ వరుస విజయాలు సొంతం చేసుకుందని, 2026లోనూ తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఏన్డీయే ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు.

7



వెనెజులా తర్వాత టార్గెట్ వాళ్లే..

వెనెజువెలా తాత్కాలికంగా తమ ఆధీనంలోనే ఉంటుందని ప్రకటించిన ట్రంప్.. లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలైన క్యూబా, మెక్సికో, కొలంబియాలకు సైతం వార్నింగ్ ఇచ్చారు.

7



ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సన్నద్ధం

'ఒలింపిక్స్-2036' క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు.

7



ట్రంప్ చేశాడు.. మీరెందుకు చేయరు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. వెనెజువెలాలో సైనిక చర్యలు చేపట్టి అక్కడి అధ్యక్షుడినే బంధించినప్పుడు.. మోదీ పాకిస్థాన్‌కు వెళ్లి 26/11 ఉగ్రదాడికి పాల్పడిన మాస్టర్‌మైండ్స్‌ను పట్టుకురావచ్చు కదా ఒవైసి అన్నారు.

7

రాజకీయం

హరీష్ రావు ప్రజెంటేషన్ బోగస్

మొదటిపేజీ తరువాయి

ప్రజెంటేషన్ ప్రజలకు అర్థం కాని విధంగా, పావర పాయింట్ ద్వారా తప్పుగా చూపించారు," అన్నారు. జగ్గారెడ్డి ప్రస్తావనలో, "కేసీఆర్ 'తోలు తీస్తా' అంటే రేవంత్ నీ నాలుక కోస్తా అన్నాడు. ఇందులో తప్పేముంది? అధికారంలో ఉంటే ఆంధ్రోళ్ల నీళ్ళు దోచబడ్డారని గుర్తుకు రాదు, ప్రతిపక్షంలో ఉంటే గుర్తుకు వస్తుంది," అని చెప్పారు. చంద్రబాబు హయాంలో కేసీఆర్ మినిస్టర్ గా ఉన్నప్పటి నుండి ఆంధ్రోళ్ల పంచాయతీ ప్రాజెక్టులు అమలు కాలేదని, అలాగే కేసీఆర్ ప్రధానమంత్రి అవడం తర్వాత కూడా ఆంధ్రోళ్ల పంచాయతీ ప్రాజెక్టులు తెర మీదకు రాలేదని గుర్తు చేశారు. "కేసీఆర్ జగన్ సీఎం హోదాలో కలిసి ఉంటే తప్పేమీ లేదు, కానీ చంద్రబాబు రేవంత్ రెడ్డి సీఎం హోదాలో ఇద్దరూ కలిసి ఉంటే తప్పా? దీనికి హరిష్ రావు సమాధానం ఇవ్వాలి." ఆయన హరిష్‌రావు ప్రజెంటేషన్ ప్రజలకు అర్థంకాకుండా ఉన్నట్టు, అధికారంలో ఉన్న కేసీఆర్ పనులను తగ్గించి, ప్రతిపక్షంలో ఉన్నప్పటికి మోసపూరితంగా చూపినట్టే అని ఆరోపించారు. అంతేకాదు, మంజీరా, సింగూరు ప్రాజెక్టులు, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ వంటి ప్రాజెక్టులు కేసీఆర్ నాయకత్వంలో పూర్తి అయ్యాయని, వాటి ద్వారా తెలంగాణ ప్రజలకు నీరు అందినట్లే, హరిష్ రావు అవన్నీ తప్పుడు చూపిస్తున్నారని ఆయన గమనించారు. 7600 కోట్ల రూపాయలతో ఏపీ ప్రభుత్వం పూర్తి చేయలేని ప్రాజెక్టులను కూడా కేసీఆర్ పూర్తి చేశారని, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాటిని "90% పూర్తి" స్థితిలో ఉంచి, ప్రభుత్వానికి అప్పగించారని గుర్తు చేశారు. జగ్గారెడ్డి, "రాజశేఖర్ రెడ్డి ఉచిత కరెంటు హామీ ఇచ్చి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో అమలు చేశారు. దీంతో బీడు భూములు పచ్చబడ్డాయి. కాని ఇవాళ కాంగ్రెస్ పార్టీ అదే చరిత్రను మర్చిపోగా, తెలంగాణలో కేసీఆర్, జగన్ పనులను విమర్శిస్తూ ప్రజలను గందరగోళంలో పడేస్తోంది," అన్నారు. సభలో పెండింగ్ ప్రాజెక్టుల గురించి అడిగిన కోమటిరెడ్డి, వెంకటరెడ్డి హరిష్ మైక్ ఇవ్వకపోవడం, రాజగోపాల్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడటానికి అవకాశంలేకపోవడం కూడా ప్రస్తావించారు. "ఇప్పుడు హరిష్ రావు మీడియా సమావేశాల్లో అసలు రాజకీయ నిజాలను మార్చి చూపిస్తున్నాడు," అని పేర్కొన్నారు. జగ్గారెడ్డి, "కాలుకు ముళ్ళు గచ్చుకుంటే, నోటి పన్నుతో తీస్తా అన్న కేసీఆర్ వ్యాఖ్యలు ఇప్పుడు హరిష్ వృత్తాంతంతో మిళితమయ్యాయి. అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసిన నిజమైన పనులు, ప్రతిపక్షంలో చేసిన విమర్శలు తేడా చూపుతూ ప్రజలను గందరగోళంలో ఉంచే ప్రయత్నం జరుగుతోంది," అన్నారు. మొత్తం విధంగా, జగ్గారెడ్డి హరిష్‌రావు ప్రజెంటేషన్ దోషపూరితమని, నిజమైన అభివృద్ధి, నీటి ప్రాజెక్టుల చరిత్ర ప్రజలకు తెలియజేయాలన్న దృఢమైన డిమాండ్ చేశారు. తెలంగాణలో కేసీఆర్ మరియు జగన్ పాలనలో మంజీరా, సింగూరు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఉచిత కరెంటు వంటి ప్రాజెక్టులు సమర్థవంతంగా అమలు అయ్యాయని, కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటిని విమర్శిస్తూ ప్రజలను మోసపరుస్తున్నారని అన్నారు.

పాలమూరుకు.. కాంగ్రెస్ మరణశాసనం

మొదటిపేజీ తరువాయి

గల గల పారిస్తోంది వాస్తవం కాదా? రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల్లో అతి తక్కువ నీటి వినియోగం చేసిందే కాంగ్రెస్ పార్టీ"అని హరీశ్ రావు అన్నారు.

నీటి హక్కులపై.. రాజీపడే ప్రసక్తే లేదు!

"రాయలసీమ లిఫ్ట్ ఆపిందే నేను, చంద్రబాబుకు చెప్పగానే ఆపేశారని రేవంత్ రెడ్డి చెప్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతలను అసలు బీఆర్ఎస్ అడ్డుకోలేదని అంటున్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై ఏపీ ప్రభుత్వం మే 05, 2020 నాడు జీవో జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకంటే 5 నెలల ముందే పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కేంద్రానికీ, కేఆర్ఎంబీ కి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసింది. నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని ప్రకటించింది. 22 అక్టోబర్ 2020 నాడు జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి తెగేసి చెప్పింది. పర్యావరణ అనుమతి లేకుండా రాయలసీమ లిఫ్ట్ పనులు చేపట్టడంపై NGT లో కేసు వేసి, 24.02.2021 నాడు స్టే సాధించి పూర్తిగా ప్రాజెక్టు పనులు నిలిచి పోయేలా అడ్డుకున్నదే బీఆర్ఎస్ పార్టీ"అంటూ హరీశ్ రావు స్పష్టత ఇచ్చారు.

ఆ 32 లేఖలే.. పోరాటానికి సజీవ సాక్ష్యాలు!

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 42 రోజుల్లోనే, కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు న్యాయమైన 69% వాటా కేటాయించాలని కేసీఆర్ లేఖ రాశారు. ఇది కేసీఆర్ కు తెలంగాణ నీటి హక్కుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. ఇలా 2014 నుంచి 2023 వరకు, సెక్షన్ 3 కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్విరామంగా కేంద్రానికి 32 లేఖలు రాసింది. కేసీఆర్ రాజీలేని పోరాటానికి ఈ లేఖలే సజీవ సాక్ష్యాల''ని హరీశ్ రావు వెల్లడించారు.



సీఎం రేవంత్ రెడ్డి.. రాజీనామా చేయాలి!

పాలమూరు జిల్లాకు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు ద్రోహం చేశాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి వాటిని కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం తప్పుడు మాటలు మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు చెప్పండి. అసెంబ్లీ సాక్షిగా తప్పుడు మాటలు మాట్లాడిన మీ నాలుక కోయాలా ? ఎవరి నాలుక కోయాలి ? చీము, నెత్తురు ఉన్నోడైతే రాజ్ భవన్‌కు వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాల''ని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

అష్టదిగ్బంధనం చేసిందే.. కాంగ్రెస్ పార్టీ!

"రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణను అష్ట దిగ్బంధనం చేసిందే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో ఒక కొత్త ప్రాజెక్టు కట్టాలంటే KRMB, GRMB, అపెక్స్ కౌన్సిల్ అనుమతులతో పాటు నీటి కేటాయింపులు చేసుకోవాలి. కేసీఆర్ ఒకవైపు కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేస్తూనే, మరోవైపు గోదావరిలో 933 టీఎంసీల మన హక్కును ఎస్టాబ్లిష్ చేశారు. ఆంధ్రలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేసి, కాంగ్రెస్ పార్టీ మరణశాసనం రాసింది. ఆ పార్టీ తెచ్చిన ఆయకట్టు కన్నా, బీఆర్ఎస్ ఏడున్నర రెట్లు ఎక్కువగా సాధించింద''ని హరీశ్ రావు అన్నారు.

ఉత్తమ్ కట్టుకథలు.. రేవంత్ పిట్టకథలు!

"నీటి పంపకాల విషయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కట్టుకథలు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పిట్ట కథలు చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో సాగునీటి రంగంలో స్వర్ణయుగం కొనసాగింది. కానీ రెండేళ్ల కాంగ్రెస్ పాలన అందుకు పూర్తి భిన్నంగా ఉంది. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులను కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేస్తున్నార''ని హరీశ్ రావు విమర్శించారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా?

పోలీసులకు సమాచారమివ్వండి

- విలువైన వస్తువులు లాకర్లలోనే భద్రపరుచుకోండి
- నగరవాసులకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, జనవరి 4: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే నగరవాసులకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ కీలక సూచనలు చేశారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికెళ్లే వారు.. వెళ్లే ముందు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా నగరవాసులను అప్రమత్తం చేశారు. పండుగ వేళ చాలామంది కుటుంబ సమేతంగా ఊర్లకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశముందని సీపీ పేర్కొన్నారు. ప్రయాణానికి ముందే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ, బీట్ ఆఫీసర్‌కు గానీ సమాచారం ఇస్తే.. పెట్రోలింగ్‌లో భాగంగా సిబ్బంది ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదని సీపీ సజ్జనార్ ప్రజలకు హితవు పలికారు. వాటిని బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చని, తద్వారా పండుగను ప్రశాంతంగా జరుపుకోవచ్చని పేర్కొన్నారు. ఆధునిక పోలీసింగ్ అంటే కేవలం నేరాలు జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదని, నేరాలను ముందుగానే నివారించడం కూడా అని ఆయన అభిప్రాయపడ్డారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, మీ ఇళ్ల భద్రతకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అత్యవసర సమయంలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.

హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్లు?

మొదటిపేజీ తరువాయి

చక్కదిద్దుకోవాలని, జోనల్ కమిషనర్లతో పని చేయించుకోవడం మీ బాధ్యతే అని టెలీ కాన్ఫరెన్స్‌లో వారికి పలు రకాల సూచనలు చేశారు. కొనసాగింపుగా ఆయా జోన్ల పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఉన్నతాధికారులను సైతం నియమించారు.

త్వరలో ఉత్తర్వులు

ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 12 జోన్లు, వాటి పరిధిలో 60 సర్కిళ్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ జోన్లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీసీఎంసీ), మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంఎంసీ) ఏర్పాటవుతాయని తెలుస్తోంది. జీఎంఎంసీ పరిధి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జీసీఎంసీ పరిధికి ప్రస్తుత అదనపు కమిషనర్ సృజనని కమిషనర్లుగా నియమిస్తూ పాలకమండలి పూర్తయ్యాక ఉత్తర్వు వెలువడుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

నిర్మాణ అనుమతులు అక్కడి నుంచే

నూతన గ్రేటర్ కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను ఇద్దరు డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆయా జోన్ల పరిధిలోని నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వారి ద్వారానే కమిషనర్ పర్మిషన్‌కు వెళ్లనున్నాయి.

20 శాతం ఖాళీల భర్తీ

విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరానికి 20శాతం మేర ఉద్యోగుల కొరత ఏర్పడింది. పారిశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారులు లెక్కలను తేల్చారు. మరో 1,500 మంది అవసరమని, ఉన్నతాధికారులతో తక్షణమే కమిటీ వేయాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10తో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ అధికారికంగా మొదలుకానుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే 2027 వరకు జరిగే అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పలు విశ్లేషణలు చేస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. వంద, రెండు వందలు కాదు. ఏకంగా 4 వేలకు పైగా ఫిర్యాదులు జీహెచ్ఎంసీ విస్తరణ సమస్యపై బుట్ట దాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి, హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించడం పట్ల వారిలో ఆందోళన నెలకొంది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలే కాకుండా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా జీహెచ్ఎంసీ విస్తరణను సవరించాలని కోరుతున్నారు.

కీలక ఘట్టం

ఈ విస్తరణతో జీహెచ్ఎంసీ పరిధితో సరిపడా భూలభ్యత, రవాణా, నివాసం, వర్షపు నీటి పారుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది. అలాగే కొత్తగా విలీనమైన ప్రాంతాలకు జీహెచ్ఎంసీ నిధులు, సాంకేతిక నైపుణ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, అత్యవసర సేవలు వంటి ప్రామాణిక పౌర సేవలు మరింత మెరుగ్గా అందే అవకాశం ఉంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ ప్రక్రియ కీలక ఘట్టమని ప్రభుత్వం భావిస్తోంది.

మటన్ షాపులో దారుణం..

- మూగ జీవాల రక్తం సేకరించే ముఠా గుట్టు రట్టు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: మూగ జీవాల రక్తం సేకరిస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మేడ్చల్ జిల్లా కీసర పీఎస్ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో కొంతమంది దుర్మార్గులు మూగ జీవాల రక్తం సేకరిస్తూ ఉన్నారు. మటన్ షాపులో మేకలు, గొర్రెలు, ఇతర మూగ జీవాల రక్తం సేకరించటం మొదలెట్టారు. సేకరించిన రక్తాన్ని ప్యాక్ చేసి వేరే చోటుకు తరలిస్తూ ఉన్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు మటన్ షాపుపై రైడ్ చేశారు. మటన్ షాపు ఓనర్‌తో పాటు నకిలీ వెటర్నరీ డాక్టర్‌ను అరెస్ట్ చేశారు. షాపు నుంచి 180 ప్యాకెట్ల రక్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మూగ జీవాల రక్తంతో కొన్ని రకాల వ్యాధులు నయం అవుతాయని ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం.

కృష్ణా నీళ్లతో రాజకీయం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ నుంచి జిల్లాల వరకూ సాగుతున్న రాజకీయ వ్యవస్థ మొత్తం డ్రామాల మయమైందని, ప్రజా సమస్యలు మాత్రం పూర్తిగా పక్కన పడిపోయాయని ఆమె ఆరోపించారు. కృష్ణా నది నీళ్ల అంశంలో ప్రభుత్వం అసెంబ్లీలో అడ్డగోలు అబద్ధాలు చెప్పిందని, ప్రతిపక్షం లేకపోవటాన్ని ఆసరాగా చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడారని మండిపడ్డారు. కృష్ణా నది నీళ్లపై చర్చ అని చెప్పి నాలుగు రాష్ట్రాల స్టేక్ హోల్డర్స్ గురించి మాట్లాడకుండా కేవలం అపెక్స్ కౌన్సిల్ లేఖలకే పరిమితం కావటం ప్రజలను మోసం చేయడమేనని కవిత అన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుతుంటే తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్ల వంద టీఎంసీల వరకు నీటి నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ, ఆల్మట్టి ఎత్తు పెంపుపై వెంటనే తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాజకీయ లాభాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం కృష్ణా నది నీళ్లను కాపాడాలని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట్-కొడంగల్ ప్రాజెక్టుల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలోనే 77.5 టీఎంసీల కేటాయింపులు ఉంటే కేవలం 45 టీఎంసీలకే ఎందుకు అంగీకరించారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ విషయంలో పాలమూరు ప్రజలకు అన్యాయం జరుగుతోందని, దీనికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. జూరాల నుంచి శ్రీశైలం వైపు ఇన్‌టేక్ పాయింట్ మార్చిన వ్యవహారం వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపిస్తూ, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ప్రజలకు నిజాలు చెప్పాలని సవాల్ విసిరారు. అసెంబ్లీలో హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో సభను బాయ్‌కాట్ చేయటం బీఆర్ఎస్ డ్రామా అని కవిత ఎద్దేవా చేశారు. ప్రతిపక్షం అంటే ఒక వ్యక్తి కాదని, అది ప్రజల గొంతుకని గుర్తు చేశారు. ఒక అంశంపై అభ్యంతరం ఉంటే ఆ అంశానికే పరిమితం కావాలి తప్ప మొత్తం సభను వదిలిపోవటం ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. బాయ్‌కాట్ నిర్ణయం హరీష్ రావు తీసుకున్నదా? లేక కేసీఆర్, కేటీఆర్ తీసుకున్నారా? అన్నది బీఆర్ఎస్ స్పష్టంగా చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన అవినీతి, అక్రమాలపై కూడా కవిత తీవ్ర



వ్యాఖ్యలు చేశారు. చెరువులు, దేవాలయాలు, ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరుగుతున్నాయని, ఇసుక మాఫియా వల్ల బ్రిడ్జీలు కూలే స్థితికి వచ్చాయని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నుంచి మెడికల్ కాలేజీల వరకూ ఎక్కడ చూసినా నాణ్యతలేని పనులు, అసంపూర్తి ప్రాజెక్టులే కనిపిస్తున్నాయని విమర్శించారు. తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, ఉన్న లిఫ్ట్‌లు పనిచేయకపోయినా కొత్త ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల దోపిడీ జరుగుతోందని అన్నారు. కోదాడలో జరిగిన కర్ల రాజేష్ కస్టోడియల్ డెత్ ఘటనను ప్రస్తావిస్తూ ప్రభుత్వం దయలేకుండా ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుందని కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ బెయిల్ వచ్చే కేసులో రిమాండ్ చేసి, పలు స్టేషన్లకు తిప్పి మానసికంగా, శారీరకంగా వేధించారని ఆరోపించారు. బాధ్యులైన అధికారులపై ఇప్పటివరకు చర్యలు లేకపోవటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపి ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పర్యటనలో ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కవిత అక్కడి వైద్య సౌకర్యాల లోపాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు కేఎల్ఎన్ రావు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్ లో మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా ప్రజలకు ఇంకా ప్రాథమిక అవసరాలు అందకపోవటం బాధాకరమన్నారు. ఉద్యోగాలు, విద్య, వైద్యం లాంటి మౌలిక అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాజకీయ పార్టీలన్నీ తక్షణ లాభాల కోసమే పనిచేశాయని, తెలంగాణకు దీర్ఘకాలిక ప్రయోజనాలపై ఎవ్వరూ నిజాయితీగా ఆలోచించలేదని కవిత వ్యాఖ్యానించారు. అందుకే జాగృతి జనం బాట ద్వారా ప్రజల మధ్యకు వచ్చి ప్రతి సమస్యను అడ్రస్ చేస్తూ పరిష్కారం వచ్చే వరకూ ఫాలోఅప్ చేస్తామని ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతి రాజకీయ పార్టీగా మారుతుందని, హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానం తప్పకుండా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై ఎవరు ఎంతగా దాడి చేసినా తాను వెనక్కి తగ్గబోనని, తెలంగాణ ప్రజల కోసం మాట్లాడుతూనే ఉంటానని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.



సాయిబాబా కుటుంబీకులను పరామర్శించిన ఏపీ సీఎం

- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన చంద్రబాబు
- త్వరలోనే అన్నీ విషయాలు వెల్లడిస్తానంటూ వ్యాఖ్య

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి4: ఇటీవల మరణించిన తెలంగాణ టీడీపీ సీనియర్ నేత, సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా కుటుంబీకులను ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పరామర్శించారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాయిబాబా ఇంటికి వెళ్లారు. విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు...విమానాశ్రయం నుంచి నేరుగా సాయిబాబా నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సాయిబాబాతో తనకున్న సుధీర్ఘ అనుబంధాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీలో నిర్మిస్తున్న ప్రాజెక్టులపై ఆదివారంనాడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు నాయుడు స్పందించారు. త్వరలోనే అన్ని విషయాలు మాట్లాడతానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. విదేశీ పర్యటన ముగియడంతో ఆయన హైదరాబాద్ చేరుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పై తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తెలంగాణ అసెంబ్లీలో ఏం జరిగిందో తనకు తెలుసని, కృష్ణా జలాల వివాదంపై త్వరలోనే మాట్లాడతానని చంద్రబాబు స్పష్టం చేశారు.



నా చిన్నప్పుడు పాకిస్తాన్ నుంచి ఆస్ట్రేలియా వచ్చినప్పుడు పేరెంట్స్ తారిఖ్, ఫౌజియా చాలా త్యాగాలుచేశారు. మా భవిష్యత్ కోసం పాకిస్తాన్‌లో పెద్ద ఇల్లు, విలాసవంతమైన జివితాన్ని వదులుకున్నారు. కరెన్సీ మార్పిడి కష్టమైంది.

- ఆస్ట్రేలియా క్రికెటర్ ఖవాజా

'భ్రష్టాసురుల సైన్యం' బీఆర్ఎస్ నేతలే

- కేటీఆర్ వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ కౌంటర్



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి4 : బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలకు టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కేటీఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరిందని, బంగారు తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన 'భ్రష్టాసురుల సైన్యం' బీఆర్ఎస్ నేతలేనని ఆయన మండిపడ్డారు. నిరుద్యోగుల ఉసురు తగలడం వల్లే బీఆర్ఎస్ పార్టీ ఈ పరిస్థితికి వచ్చిందని విమర్శించారు. బీసీల పట్ల చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం తీసుకొచ్చిందని స్పష్టం చేశారు. ఉరి తీయడం అంటే తప్పు చేసిన వారికి శిక్ష వేయడమేనని వ్యాఖ్యానించిన మహేష్‌కుమార్ గౌడ్, కోట్ల ఆశలతో సాధించుకున్న తెలంగాణను బీఆర్ఎస్ పాలన అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల ప్రజాపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి దిశగా సాగుతోందని, అందుకే జూబ్లీహిల్స్, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ప్రజాదరణ లభించిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలు, రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన కేటీఆర్‌కు కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాల కోసం కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు చేసినందుకే కాంగ్రెస్‌ను శిక్షించాలా? లేక బీసీలకు మోసం చేసిన బీఆర్ఎస్‌ను శిక్షించాలా? అని నిలదీశారు. ఇప్పటికే కాళేశ్వరం అవినీతి వ్యవహారంతో ప్రజల్లో బీఆర్ఎస్ పరువు పోయిందని, ఇప్పుడు పాలమూరు ప్రాజెక్టులోనూ వారి బాగోతం బయటపడుతుందనే భయంతోనే అసెంబ్లీ నుంచి పారిపోయారని ఆరోపించారు. ఈ విషయాల నుంచి దృష్టి మళ్లించేందుకే చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- 36 మంది పెన్షనర్ల మరణాలకు రేవంత్ సర్కార్ బాధ్యత వహించాలి
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనరీ బకాయిల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని, ఈ నిర్లక్ష్యమే రాష్ట్రవ్యాప్తంగా 36 మంది పెన్షనర్ల మరణాలకు కారణమైందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర నిర్మాణంలో వెన్నెముకగా నిలిచిన ఉద్యోగులను పదవీ విరమణ అనంతరం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. 35-40 సంవత్సరాలు ప్రజాసేవ చేసిన ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా జీవించాల్సి ఉండగా, అప్పుల భయంతో ఇళ్లు వదిలి పారిపోయే పరిస్థితులు ప్రభుత్వం సృష్టించిందని విమర్శించారు. పెన్షనరీ బకాయిలు అందక ఆర్థిక, మానసిక వేదనతో ఇప్పటివరకు 36 మంది పెన్షనర్లు మరణించారని, ఇవి సహజ మరణాలు కావని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'చట్టబద్ధమైన హత్యలు' అని దేశపతి ఆరోపించారు. ముఖ్యమంత్రి స్వగ్రామానికి చెందిన కుడుముల కొండయ్య అనే పెన్షనర్ వైద్యం అందక మరణించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. పోలీస్ అధికారిగా పనిచేసిన బాలకిషన్ కుటుంబం ఎదుర్కొన్న విషాదం, నల్గొండ జిల్లాలో అప్పుల భారంతో ఉద్యోగులు ఇళ్లు వదిలి పారిపోతున్న ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. జీపీఎఫ్, టి ఎస్ జి ఎల్ ఐ, జీఐ ఎస్ వంటి నిధులు ప్రభుత్వ దానాలు కాదని, ఉద్యోగులు తమ జీతాల నుంచి దాచుకున్న సొంత సొమ్మని స్పష్టం చేశారు. వాటిని 'ఈకుబేర్' పేరుతో నిలిపివేయడం దారుణమని విమర్శించారు. రిటైర్ అయిన 14 వేల మంది ఉద్యోగుల జీపీఎఫ్, జీ ఐ ఎస్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, పెన్షన్ కమ్యూటేషన్ మొత్తాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, పెన్షన్ బకాయిలు అందక మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, కొత్త పీఆర్సీ అమలు చేయడంతో పాటు ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పెన్షనర్ల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని దేశపతి శ్రీనివాస్ హెచ్చరించారు.

మండల కార్యవర్గాలు 15లోగా పూర్తి చేయాలి

- డీసీసీ అధ్యక్షులకు టీపీసీసీ చీఫ్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో జరిగిన జూమ్ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ పాల్గొన్నారు. ఈ నెల 8వ తేదీ లోగా డీసీసీ కార్యవర్గ కూర్పు పూర్తి చేసి నివేదికలను అధిష్ఠానానికి అందించాలని, 15వ తేదీ లోగా మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలు పూర్తిచేయాలని ఆదేశించారు. 8వ తేదీన గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరగనుందని తెలిపారు.



కమీషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టారు


- కేటీఆర్, హరీష్‌రావుపై చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికీ కేసీఆర్ చావును కోరుకునే వ్యక్తి కాదని, సీఎం పదవి కోసం కేటీఆర్, పార్టీపై పూర్తి ఆధిపత్యం కోసం హరీష్‌రావు మాత్రమే అలాంటి ఆలోచనలు చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కమిషన్ల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణ, గోదావరి జలాలపై ప్రాజెక్టులు చేపట్టిందని, నీళ్లు-నిధులు-నియామకాల నినాదాన్ని తుంగలో తొక్కిందని విమర్శించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై వాస్తవాలను సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజల ముందుకు తెస్తే బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని, ఆయన అసెంబ్లీకి వచ్చి నీటి వివాదాలపై వాస్తవాలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనను ప్రజలు అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటికే తిరస్కరించారని, అయినా ఆ పార్టీ నేతలు మారడం లేదని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు.



అంబేద్కర్ వర్సిటీలో జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 4 : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ విభాగం అధ్వర్యంలో నిర్వహించనున్న "సుస్థిర అభివృద్ధి కోసం వ్యాపార పరివర్తన" అనే రెండు రోజుల జాతీయ సదస్సు బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సు మార్చి 13, 14 తేదీలలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో ప్రముఖ వ్యక్తులను ముఖ్య అతిథిగా, ముఖ్య వక్తలుగా, పరిశ్రమ, ప్రభుత్వ సంస్థల నుండి ప్రముఖులు ప్యానెల్ చర్చ పాల్గొని "సుస్థిరత కోసం డిజిటల్ పరివర్తన; ఫిన్‌టెక్ మరియు సస్టైనబుల్ ఫైనాన్స్; డిజిటల్ మార్కెటింగ్, సస్టైనబుల్ రిటైలింగ్, సరఫరా గొలుసు మరియు కార్యకలాపాలు; సస్టైనబుల్ మానవ మూలధనం న్యాయ కత్వం; స్టైనబుల్ హెల్త్‌కేర్ సేవలు మరియు సస్టైనబుల్ వ్యాపార నమూనాలు అనే అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ. జి. పుష్పా చక్రపాణి; రిజిస్ట్రార్, డా. ఎల్. విజయా కృష్ణా రెడ్డి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగ డీన్ ప్రొ. ఆనంద్ పవార్, ప్రొ. రబింద్రనాథ్ సోలమన్; డా. రాధాకృష్ణ, డా. బర్ల శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోలవరం–నల్లమల్ల సాగర్‌పై

న్యాయ పోరాటానికి తెలంగాణ సిద్ధం

- సీనియర్ న్యాయవాదులతో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కీలక భేటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: గోదావరిపై ఏపీ ప్రభుత్వం చేపట్టిన పోలవరం-నల్లమల్ల సాగర్ (బనకచర్ల) విస్తరణ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ఆదివారనాడు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని ప్రత్యేకంగా కలుసుకున్నారు. తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కోర్టులో సమర్థమైన వాదనలు వినిపించాలని న్యాయనిపుణులకు సూచించారు. కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలు, సాంకేతిక వివరాలు సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమల్ల సాగర్‌కు లింక్ చేయాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఈ పనులను వెంటనే ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరింది. మొదట ఆమోదించిన రూపురేఖల ప్రకారమే పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగాలని, అదనపు విస్తరణలు చేపట్టడం చట్టబద్ధం కాదని పిటిషన్‌లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల్ల సాగర్ ప్రాజెక్టు ప్రీ-ఫిజిబిలిటీ నివేదికలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సరి కాదని అభ్యంతరం తెలిపింది. ఈ విషయంలో కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, గోదావరి జల యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకి సిద్ధమవుతోందని, వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని పిటిషన్‌లో పేర్కొంది. అలాగే, ఏపీ ప్రతిపాదించిన ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం కోరింది.



దివ్యాంగులకు అన్నలా తోడుంటా

- అంధత్వాన్ని అవకాశంగా మార్చిన మహనీయుడు బ్రెయిలీ
- సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి4: అంధత్వాన్ని శాపంగా కాకుండా అవకాశంగా మార్చిన వ్యక్తి బ్రెయిలీ అని, ఆయన ఒక వ్యక్తి కాదని, ఒక ఆలోచన, ఒక ఉద్యమమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అందులకు మాత్రమే కాదు, సమాజానికే వెలుగు చూపిన మహనీయుడని పేర్కొన్నారు. తాను శాఖ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు అవుతోందని, ఈ కాలంలో దివ్యాంగుల సమస్యలపై నిరంతర దృష్టి పెట్టి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని చెప్పారు. తాను ఒక మంత్రి మాత్రమే కాదని, దివ్యాంగులకు అన్నలా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం పదవ తరగతి వరకే బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అనేక మంది దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపామని, రానున్న రోజుల్లో ఇంటర్మీడియట్ తో పాటు డిగ్రీ స్థాయి వరకు బ్రెయిలీ పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల బస్సు ప్రయాణ సమస్యపై వేదికపైనుండే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించే అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రొఫెషనల్ గాయకుల స్థాయిలో విద్యార్థులు పాటలు పాడటం అభినందనీయమని మంత్రి పేర్కొంటూ, ఇందుకు కీలకంగా కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వివిధ అందుల సంఘాల ప్రతినిధులు, దివ్యాంగ అసోసియేషన్ నాయకులు, వివిధ అందుల పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



వికలాంగులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 4: అంధుల లిపి ఆవిష్కర్త లూయిస్ బ్రెయిలీ 217వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వికలాంగులకు అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే నెరవేర్చాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ మలక్‌పేటలోని లూయిస్ బ్రెయిలీ పార్కులో ఫెడ్ సమస్త అధ్యక్షులు గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో పాల్గొని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిద్దె రాజేష్ మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్‌ను రూ.6000కు పెంచాలని, ఆర్టీసీలో వికలాంగులకు 100 శాతం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, బ్యాక్లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, సూర్యాపేట శ్రీనివాస్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మారవేణి చంద్రశేఖర్ యాదవ్, వాంకుడోత్ లాల్ సింగ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినేత బండి శ్రీనివాస్, ఎర్ర నరసింహం, కుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగివుండాలి

- షి- టీమ్ ఇంచార్జ్ శ్యామ్ సుందర్


ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 4 : విద్యార్థులు తప్పనిసరిగా పోక్సో, సైబర్, నిర్భయ యాక్ట్ పై అవగాహన కలిగివుండాలని చేవెళ్ల షి టీమ్ ఇంచార్జ్ శ్యామ్ సుందర్ అన్నారు. మండల కేంద్రంలోని టీజీ మైనార్టీ రెసిడెన్షియల్ గర్ల్స్ పాఠశాల, కళాశాలలో చేవెళ్ల షి టీమ్ బృందంచే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, 18ఏళ్ల లోపు వయసు గల పిల్లల పై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలి పారు. చిన్నారి బాలబాలికలను వివిధ రకాలైన లైంగిక వేధింపుల నుండి రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో ఆక్ట్ గురించి ఉదాహరణలతో సహా వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 10 ఏళ్లు అయినా కూడా ఇంకా సరైన అవగాహన లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అన్నారు. అమ్మాయిలు తమ వ్యక్తిగత వివరాలను ఎక్కడ షేర్ చేయకూడదన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 100, 112, సైబర్ నేరాలకు 1930 కి, బాల్య వివాహాలు, చిన్నపిల్లలకి ఇబ్బంది కలిగినప్పుడు 1098కి సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా ఆన్లైన్ గేమ్స్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ బృందం జ్యోతి, వైద్యనాథ్, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రజినీ దీప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సాయం

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 4: మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన తలారి రేనమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ రామచందర్ (రత్నం) మృతిరాలి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మృతురాలి భర్త చిన్న మరయ్య, తలారి రాజు, పద్మారావు, అంతయ్య, సామయ్య, చంద్రమౌళి, శ్రీను, శేఖర్, కార్తీక్, కిరణ్, రాజు, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

“



గతంలో ఉద్యోగం ఉంటే జీవితానికి భద్రత ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. 2025లో పెద్ద టెక్ కంపెనీలే వేల కొద్ది ఉద్యోగులను తొలగించాయి. అందుకే మీ ఫైనాన్సియల్ ఐక్యూ పెంచుకోండి. డబ్బు సేవ్ చేయకండి. బంగారం, వెండి, బిట్ కాయిన్, ఇథీరియమ్ వంటి వాటిని సేవ్ చేసుకోండి.

- రిచ్‌డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి

సంస్మరణ

స్పర్శతో వెలిగిన జ్ఞాన దీపం

చూపు లేని వారి ప్రపంచం మౌనంగా ఉండదన్న సత్యాన్ని బ్రెయిలీ లిపి నిరూపించింది. వారి చేతులే వారి కళ్లుగా మారి అక్షరాలను చదువుతాయి. స్పర్శకు స్పందించే చుక్కలు భావాలకు రూపం ఇస్తాయి. భాష, గణితం, సంగీతం, శాస్త్రం — అన్నీ ఈ లిపి ద్వారా అర్థమయ్యే స్థాయికి చేరాయి. చదువు అనేది వినడం వరకే పరిమితం కాకుండా, అనుభూతిగా మారింది. బ్రెయిలీ లిపి అంధుల జీవితాల్లో కేవలం విద్యను మాత్రమే కాదు, వ్యక్తిగత గౌరవాన్ని కూడా నింపింది.జ వితంలో ఎదురైన దురదృష్టం లూయిస్ బ్రెయిలీని నిలిపివేయలేదు; అది అతని ఆలోచనలకు దిశానిర్దేశం చేసింది.




చిటికెన కిరణ్ కుమార్
9490841284

మనిషి జీవన ప్రయాణంలో చూపు ఒక శక్తి అయితే, చూపు లేకుండానే ప్రపంచాన్ని అనుభవించే సామర్థ్యం మరో అపూర్వ సాధన. దృష్టి లోపం ఉన్నవారిని దయతో మాత్రమే చూడటం వారి అసలైన శక్తిని అర్థం చేసుకోలేకపోవడమే అవుతుంది. ప్రపంచం నలుమూలల ఉన్న కోట్లాది మంది తమలో దాగిన ఆలోచనా లోతులను, సృజనాత్మక ప్రతిభను వెలికి తీయడానికి సరైన అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఆ అవకాశాలకు దారి చూపిన అక్షర రూపమే బ్రెయిలీ లిపి. వ్యక్తిని పరిమితుల్లో బంధించకుండా, సామర్థ్యాల వైపు నడిపించే ఈ లిపి, జీవితం సంపూర్ణంగా అనుభవించడానికి ఒక మార్గాన్ని చూపించింది.బ్రె యిలీ లిపి వెనుక ఉన్న కథ ఒక సాధారణ ఆవిష్కరణ కథ కాదు; అది మనోధైర్యం, పట్టుదల, మేధస్సు కలిసి రూపొందించిన చరిత్ర. ఫ్రాన్స్ దేశంలోని కూప్‌వ్రే అనే చిన్న ప్రాంతంలో జన్మించిన లూయిస్ బ్రెయిలీ, బాల్యంలో ఎదురైన ప్రమాదంతో చూపును కోల్పోయినా, తన భవిష్యత్తును చీకటిలోకి నెట్టివేయలేదు. చదువుపై ఉన్న తపన, నేర్చుకోవాలన్న తృష్ణ ఆయనను కొత్త ఆలోచనల వైపు నడిపించింది. అప్పటివరకు ఉన్న సంకేత పద్ధతులను పరిశీలిస్తూ, స్పర్శ ఆధారంగా చదవగల లిపి అవసరాన్ని గుర్తించారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే ఆరు చుక్కల వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఒక వ్యక్తిగత బాధ నుంచి పుట్టిన ఈ ఆలోచన, నేడు ప్రపంచవ్యాప్తంగా అంధుల జీవితాల్లో వెలుగుల పంట పండిస్తోంది.

చూపు లేని వారి ప్రపంచం మౌనంగా ఉండదన్న సత్యాన్ని బ్రెయిలీ లిపి నిరూపించింది. వారి చేతులే వారి కళ్లుగా మారి అక్షరాలను చదువుతాయి. స్పర్శకు స్పందించే చుక్కలు భావాలకు రూపం ఇస్తాయి. భాష, గణితం, సంగీతం, శాస్త్రం — అన్నీ ఈ లిపి ద్వారా అర్థమయ్యే స్థాయికి చేరాయి. చదువు అనేది వినడం వరకే పరిమితం కాకుండా, అనుభూతిగా మారింది. బ్రెయిలీ లిపి అంధుల జీవితాల్లో కేవలం విద్యను మాత్రమే కాదు, వ్యక్తిగత గౌరవాన్ని కూడా నింపింది.జ వితంలో ఎదురైన దురదృష్టం లూయిస్ బ్రెయిలీని నిలిపివేయలేదు; అది అతని ఆలోచనలకు దిశానిర్దేశం చేసింది. తన చీకటిని ఇతరుల వెలుగుగా మార్చాలన్న సంకల్పం ఆయనను నిరంతరం ముందుకు నడిపించింది. ఆ కృషి వల్ల అంధుల విద్య ఒక కొత్త మలుపు తిరిగింది. చదవడం, రాయడం అనేది ఇకపై ఇతరులపై ఆధారపడే ప్రక్రియగా మిగలలేదు. జ్ఞానం వారి చేతుల్లోకి వచ్చింది. ఈ మార్పే బ్రెయిలీ లిపి సాధించిన గొప్ప విజయం.

కాలక్రమంలో బ్రెయిలీ లిపి ప్రభావం విద్యాకే పరిమితం కాలేదు. ఉపాధి అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక రంగాలు, సామాజిక భాగస్వామ్యం — అన్నింటిలోనూ అంధులకు ఇది బలమైన ఆధారంగా మారింది. తమ ఆలోచనలను తామే చదివి, రాసి, పంచుకునే స్థాయికి వారు చేరుకున్నారు. ఈ నిశ్శబ్ద మార్పే సమాజంలో గమనించాల్సిన ముఖ్యమైన పరిణామం. బ్రెయిలీ లిపి అంధుల జీవితాల్లో స్వావలంబనకు మార్గం వేసింది.



ప్రపంచ బ్రెయిలీ దినం అనేది కేవలం ఒక తేదీ గుర్తు చేసుకునే సందర్భం కాదు. అది మన దృక్పథాన్ని పునః పరిశీలించుకునే అవకాశం. దృష్టిలోపం ఉన్నవారిని సంరక్షణ అవసరమైనవారిగా కాకుండా, సమాన సామర్థ్యం ఉన్న పౌరులుగా చూడాలన్న ఆలోచనను ఇది బలపరుస్తుంది. ప్రతి విద్యార్థికి, ప్రతి పాఠశాలకు, ప్రతి గ్రంథాలయానికి బ్రెయిలీ లిపి చేరువ కావడం సమానత్వ దిశగా వేసే గట్టి అడుగు. ఈ దిశలో ప్రతి ప్రయత్నం విలువైనదే.

చుక్కల రూపంలో కనిపించే అక్షరాలు అంధుల జీవితాల్లో ఆనందాన్ని మాత్రమే కాదు, ఆశను కూడా నింపాయి. చూపు ఉన్నవారికి ఇది ఒక బోధన — పరిమితులు సృజనను ఆపలేవని. చూపు లేనివారికి ఇది ఒక ధైర్య వాక్యం — లోకం అర్థం చేసుకోవడం మీకూ సాధ్యమేనని. బ్రెయిలీ లిపి ఈ రెండు సందేశాలను ఒకేసారి అందించింది.

చీకటిని జయించి వెలుగుగా మారిన ఈ అక్షర వ్యవస్థ సమాజంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. బ్రెయిలీ లిపి అంధుల జీవితాల్లో మరింత లోతుగా ప్రవేశించాలి. అది విద్యలోనే కాదు, ప్రతి సామాజిక రంగంలోనూ ఉపయోగంలోకి రావాలి. అప్పుడే అంధులు తమ జీవితాలను తాము నిర్మించుకునే స్వేచ్ఛను సంపూర్ణంగా అనుభవించగలుగుతారు. ఈ అక్షరాలు మనందరికీ మానవీయ స్పర్శ విలువను గుర్తు చేసే సజీవ ఉదాహరణగా నిలవాలి.

బ్రెయిలీ లిపిని స్మరించుకోవడం అంటే ఒక లిపిని మాత్రమే కాదు, ఒక ఆలోచనా పరివర్తనను గుర్తు చేసుకోవడమే. చూపు లేని జీవితం పరిమితమనే భావనను చెరిపేసే దృక్పథం దీనిలో దాగి ఉంది. స్పర్శ ద్వారా చదవడం నేర్పిన ఈ అక్షరాలు అంధుల జీవితాల్లో జ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా నింపాయి. ఈ లిపి మరింత మందికి చేరాలి, మరింత రంగాల్లో విస్తరించాలి. చుక్కలుగా కనిపించే ఈ అక్షరాలు సమాజంలో సమానత్వ భావనను లోతుగా నాటే శక్తిగా కొనసాగాలని ఆకాంక్షించడమే ఈ సందర్భంలో మనందరి బాధ్యత.

(వ్యాసకర్త : ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసర్చ్ ఫోరం సభ్యులు)

పరిచయం

బోడో సాహిత్యంలో ప్రజా కవితా ఝురి

'ముదై గహై': డా.రాంచియారీ బరంచారీ



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871


ముదై గహై కలం పేరుతో సాహిత్య రచన చేస్తున్న డా.రాంచియారీ బరంచారీ ఒక ప్రముఖ ఆధునిక బోడో కవి రచయిత. బోడో భాషా సాహిత్యానికి గణనీయమైన కృషి చేసిన ఆయన అస్సాంకు చెందిన వైద్యుడు. ఆయనకు బోడో కవితా సంకలనం ''ఖోరో సయావో అర్వ్ హిమాలయ్'' కవితా సంపుటికి 2021లో ప్రతిష్టాత్మక సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయన అస్సాంకు చెందినవారిలో ముదై గహై పేరుతో కవిత్వం,నవల రచనకారులు.ఆయన బోడోకవి, రచయిత.ప్రభుత్వ వైద్యుడుగా పనిచేశారు. 2021లో, ఆయన బోడో కవితా సంకలనం 'ఖోరో సయావో అర్వ్ హిమాలయ్' కోసం సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు.ఆ అవార్డు గుర్తింపుగా అస్సాంలో ఆయనను సన్మానం అందుకున్నారు.అది ఆయన సాహిత్య కృషికి లభించిన గౌరవానికి నిదర్శనంగా చెప్పొచ్చు. ''ఖోరో సాయో అర్వ్ హిమాలయ'' అనే పదాలు బోడో భాషకు చెందినవి. ఈ వాక్యానికి తెలుగులో ''హిమాలయాల నీడలో'' లేదా ''హిమాలయ సానువుల్లో'' అని . దీన్ని సాధారణంగా బోడో సాహిత్యంలోని కవితల్లో లేదా దేశభక్తి గీతాలలో హిమాలయ పర్వతాల పాదాల చెంత ఉన్న తమ ప్రాంతం గురించి వర్ణించడానికి ఉపయోగిస్తారు.

బోడో సాహిత్య ప్రపంచంలో ముదై గహై ఒక ప్రముఖ కవి మరియు రచయితగా పేరు పొందారు. ఆయన గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు ఇక్కడ ఉన్నాయి. బోడో భాషలో ముదై గహై బోడో సాహిత్యంలో విశిష్టమైన కవిత్వం రాయడంలో ప్రసిద్ధులు. ఆయన రచనలు బోడో సంస్కృతి, సామాజిక అంశాలు, ప్రకృతి చుట్టూ తిరుగుతాయి. ముదై గహై కవిత్వంలోని శైలి మానవీయ విలువలు, బోడో ప్రజల జీవన విధానం, వారి అస్తిత్వ పోరాటం స్పష్టంగా కనిపిస్తాయి. అస్సోంలోని బోజలి జిల్లాలోగల బరంచారి గ్రామానికి చెందిన రైతు సభా రామ్ రాంచియారీ, సోనారి రాంచియారీల కుటుంబంలో 1963లో ఐదవ కుమారుడుగా జన్మించారు. డాక్టర్ రాంచియారీ బరంచారి ఎంవి స్కూల్ నుండి ప్రాథమిక విద్యను చదివాడు. 1978లో కామ్రూప్ జనతా హై స్కూల్ నుండి మెట్రిక్యులేషన్‌ను 1981లో కోక్రాఝర్ హెచ్ఎస్ స్కూల్ నుండి పూర్తి చేశాడు. ఆపైన గౌహతి మెడికల్ కాలేజీ నుండి మెడికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. 1990లో ఆయన రౌటాలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా తన సేవలను అందించాడు. ఆయన తన సేవలతో కులమతాలకు అతీతంగా చొరవతో గ్రామీణ ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందాడు. ఆయన వివాహం మేడం నిర్మలి రాంచియారీతో జరిగింది. తన విద్యార్థి జీవితంలోనే వామపక్ష ఉద్యమం పట్ల ఆకర్షితుడై తన ఆలోచనలను, ఆశయాలను కవిత్వ రూపంలో రాయడం ప్రారంభించాడు. మంచి వక్తగా పేరుగాంచిన డాక్టర్ రాంచియారీకి బరంచారీ జెనీవాలో జరిగిన అంతర్జాతీయ వేదికపై ప్రసంగించే అవకాశం కూడా లభించింది. ఇప్పటివరకు ఆయన బోడో భాషలో 10 కవిత్వ పుస్తకాలను, ఇంగ్లీష్,



హిందీ మరియు అస్సామీ భాషలలో అనేక పుస్తకాలను రచించారు. 1996లో ఆయన పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రతిపాదించిన ఉదల్గురి నుండి అస్సాం శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తరువాత, ఆయన క్రియాశీల రాజకీయాలను విడిచిపెట్టి, రౌటాలో ప్రైవేట్ వైద్య నిపుణుడిగా తిరిగి సేవలందించడం ఆయనకు సమాజ ఆరోగ్యపట్లగల ఆలోచనకు సూచి. డా.బరంచారీ సాహిత్య కృషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్నారు. ఆ సందర్భంగా విద్యా మంత్రిగా పనిచేసే ఆతని సహవిద్యార్థి డాక్టర్ రనోజ్ కుమార్ పెగు, సూటియా శాసనసభ్యురాలు పద్మ హజారికా, బోడో సాహిత్య సభ అధ్యక్షుడు తరెన్ బోరో, ఆల్ బోడో విద్యార్థి విభాగం అధ్యక్షుడు దిపెన్ బోరో, ఆల్ అస్సోం విద్యార్థి విభాగం అధ్యక్షుడు (AASU), ABSU &AJYCP ఉడల్‌గురి జిల్లా కమిటీ డాక్టర్ రనోజ్ కుమార్ పెగును కూడా రాంచియారీని అవార్డ్ అందుకున్న సందర్భంలో మిత్రబృందం అభినందించింది ఆత్మీయంగా.అలాగే సీనియర్ మీడియా బాధ్యులు భార్గబ్ కుమార్ దాస్ ఇంకా సామాజిక కార్యకర్త నబా కుమార్ దేకా కూడా రౌటాలోని నివాసంలో కవి 'మౌదాయ్ గహై'ను అందించడం బోడో కవిత్వానికి గుర్తింపు, కవికి ఆత్మీయ అభినందన.

రచనలకు ఆహ్వానం



జనజాగృతి కళాసమితిలో అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూపు 11వ ఆవిర్భావం పురస్కరించుకుని ఔత్సాహకులైన కవులు, రచయితల నుండి రచనలను ఆహ్వానిస్తున్నాం. గేయం, పద్యం, వచనం ఏ ప్రక్రియలోనైనా రచనలు పంపవచ్చు. 25 లైన్లకు మించి ఉండరాదు. వేరే గ్రూపులో పంపి పరిశీలనలో ఉన్న వాటిని ఈ పోటీకి పంపరాదు. హామీ పత్రం తప్పకుండా జత చేయవలెను. గడువు 10 జనవరి 2026. రచనలను 9441797207 నెంబరుకి వాట్సప్ చేయాలి. గడువులోగా వచ్చిన రచనలలో ఉత్తమమైనవి ఎంపిక చేసి కవితాసంకలనంగా ప్రచురిస్తారు.

- ముక్కెర సంపత్ కుమార్ , అధ్యక్షులు
జనజాగృతి కళాసమితి, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

కవిత

అదిగో...కొంకణీ వనదేవత

పచ్చని పచ్చికపై పాదాలు ముద్రిస్తూ,
పర్వతాల మడిలో పరిమళాలు చల్లుకుంటూ,
అడవుల అద్దాల్లో తన అందం చూసుకుంటూ,
ఆమె చల్లని గాలితో జడలు
ఆడించుకుంటూ నడుస్తోంది.

పచ్చని చెట్లు -
ఆ తల్లి పచ్చని చీర అంచులై,
భూమికి శాంతి చల్లే పచ్చదనపు ప్రార్థనలై,
అందానికి ప్రతీకలై నిలుస్తున్నాయి.

ఎత్తైన చెట్లు -
ఆ దేవత తలపాగా మల్లెల్లా,
ఆకాశాన్ని తాకే ఆశల కొండలై,
వానల్ని ఆహ్వానించే వరదాతలై ఊగుతున్నాయి.


కొబ్బరి చెట్లు -
ఆ వనదేవత కంకణాల్లా మ్రోగుతూ,
తీరాలకు తీయని తల్లి పాల్లా,
నీటి అమృతాన్ని పంచే దేవదూతలవుతున్నాయి.

పోక చెట్లు -
ఆ దేవి నుదుటి బొట్టు పరిమళాలై,
పల్లెలకు పచ్చని పండుగల్ని తెచ్చే పుష్పాభిషేకాలై,
తలలు ఊపుతూ ఆకాశాన్ని పరికిస్తున్నాయి.

రబ్బరు చెట్లు -
ఆ అమ్మ చేతిరేఖలలో
ప్రవహించే పాలరసపు ప్రవాహాలై,
శ్రమికుల కలలకు జీవం పోసే శ్వేతధారలై,
గొడ్డళ్ళ గాయాలకు కన్నీరు చిందుతున్నాయి.

గుబురు చెట్లు -
ఆ అరణ్యదేవత ఒడిలోని గూళ్లై,
పక్షులకు పాటలు పంచే వేదికలై,
చీకటికి కాంతి కిరీటాలై విరాజిల్లుతున్నాయి.

ఇలా... కొంకణీ వనదేవత
చెట్టు చెట్టుకూ చైతన్యం నింపుతూ,
ఆకు ఆకు మీద ఆశలు రాస్తూ,
పచ్చదనమే ప్రార్థనగా భూమికే
భూషణమై నిలుస్తోంది...



- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

సమీక్ష

మృగ్యమవుతున్న సమాజానికి దిక్సూచి..



చంద్రకాంత్ గౌడ్ యాడవరం
9441762105

శతక పద్యాలు కేవలం సాహిత్యం మాత్రమే కాదు, అవి తెలుగు వారి జీవన విధానంలో భాగమయ్యాయి. చిన్న పిల్లలకి క్రమశిక్షణ నేర్పడానికి, పెద్దవారికి మనశ్శాంతిని ఇవ్వడానికి ఇవి ఎంతో తోడ్పడతాయి. 'తెలుగు భాష ఉన్నంత కాలం శతక పద్యాలు నిలిచి ఉంటాయి'. తెలుగు సాహిత్యంలో శతకం ప్రత్యేకమైనది .మరియు అత్యంత ప్రజాదరణ పొందిన ప్రక్రియ. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో నీతిని, భక్తిని, వైరాగ్యాన్ని బోధించడానికి శతకాలు అద్భుతమైన సాధనాలు. నేటి ఆధునిక కాలంలో, సాంకేతికత మరియు వేగం పెరిగినప్పటికీ, శతకాల యొక్క ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. నిజానికి, విలువలు మృగ్యమవుతున్న ప్రస్తుత సమాజానికి శతకాలు ఒక దిక్సూచిలా పనిచేస్తాయి. నేటి విద్యా వ్యవస్థలో కేవలం మార్కులకే ప్రాధాన్యత లభిస్తోంది. కానీ, శతకాలు మనిషికి సభ్యత సంస్కారం నేర్పుతాయి. 'సుమతీ శతకం', 'వేమన శతకం' వంటివి చిన్న చిన్న పద్యాల ద్వారా జీవిత సత్యాలను, ఏది మంచి ఏది చెడు అనే విచక్షణను కలిగిస్తాయి. సమాజంలోని లోపాలను, మనుషుల స్వభావాలను శతక కవులు ఎప్పుడో ఎండగట్టారు. నేటికీ సమాజంలో ఉన్న అవినీతి, స్వార్థం వంటి వాటిని అర్థం చేసుకోవడానికి, వాటికి దూరంగా ఉండటానికి శతకాలు ప్రేరణనిస్తాయి. శతకానికి మకుటం పంచప్రాణాలు .భక్తి వైరాగ్య,నీతి సామాజిక శతకాలు వెలుగులోకి వస్తున్నవి. కవి మొదట ఏది రాయాలన్నా సమాజాన్ని చదవాలి విశేషణ చేయాలి .విమర్శనాత్మకంగా ఆలోచించాలి. అప్పుడే శతకాన్ని రాయడానికి ముందుకు వస్తాడు. శతకములో 108 పద్యాలు ఉండడం సంప్రదాయంగా చెప్పుకోవచ్చు. తెలుగు భాష ఉపాధ్యాయులు కాల్వ రాజయ్య గారు తాను రాసిన మొదటి శతకం "రాచబాట". ఈ శతకంలో మకుటంగా "రాజు చెప్పు మాట "రాచ బాట"గా ఎంచుకోవడం అభినందనీయం. కవి సమాజ స్థితిగతులను విశ్లేషిస్తూ ఆటవెలదులతో 108 పద్యాలను రాశారు.


"పద ఎప్పుడు నరుడ శాశ్వతమ్మునుకాదు
ఉన్నదనుచు మురువ కుర్వియందు
కలిమిలేము లెపుడు కావడికుండలె
రాజు చెప్పు మాట రాచబాట"

అనుచు కవి కాల్వ రాజయ్య గారు సంపదలు శాశ్వతం కావని మొదటి పద్యంలో ఆట వెలది చందస్సులో చక్కగా తెలియజేశారు. అన్నదమ్ముల బంధాన్ని ఆత్మీయంగా ఆరవ పద్యంలో కవి ఆవిష్కరించాడు .

"అన్నదమ్ములెప్పు
దాత్మబంధువులురా పరుల
మాట బట్టి పాసిపోకు,
ఒక్క రక్తమదియే యొర్పుతోనుండాలి
రాజు జెప్పు మాట రాచబాట"

వాన నీటితో భూగర్భ జలాలను పెంచాలి అంటూ మరో పద్యంలో(36వ) కవి తెలియ జేశాడు .

"వాన నీటి నెపుడు వరదలై
పోకుండ యద్దు కట్టగట్టి
యాపినపుడె పుడమినందు
పెరుగు భూగర్భ జలములు
రాజు చెప్పు మాట రాచబాట"



పుస్తక ప్రతులకు:
పేజీలు: 48
పుస్తకం ధర: 40
కాల్వ రాజయ్య,
ముత్తన్నపేట
9177494235

విద్య గొప్పతనాన్ని 43వ పద్యంలో చక్కటి ఉపమానంతో చెప్పాడు

"విద్య నేర్చునతడు విలువతో
బ్రతుకును విద్య మనిషి
లోని వెతలు బాపు
విద్య లేని వారి వింత పశువులంద్రు
రాజు చెప్పు మాట రాచబాట"

ఇలా మొత్తం 108 పద్యాలలో ప్రతి ఒక్క పద్యం విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికి రాజబాట వేసే విధంగా రాయడం కవి గొప్పతనంగా చెప్పవచ్చు. సమాజంలో మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్క అంశాన్ని స్పృశిస్తూ, చక్కటి ఆట వెలది పద్యాలతో తన మొదటి గ్రంథంలోనే ఎంతో అనుభవం ఉన్న కవిగా చక్కటి విషయాలను తెలియజేశాడు. ఈ రాచబాట శతకం ప్రతి ఒక్కరి చేతిలో ఉండాల్సినటువంటి గ్రంథం. ఆబాలగోపాలాన్ని అలరించే సరళమైన పద్యాలతో చక్కటి భావాన్ని తెలియచెప్పే పుస్తకం ఇది. ఈ పుస్తకాన్ని చదివితే తప్పనిసరిగా ప్రతి ఒక్కరిలో చక్కటి మార్పు వస్తుంది ముఖ్యంగా విద్యార్థుల సత్ప్రవర్తనకు ఈ పుస్తకం ఒక రాచ బాటగా చెప్పవచ్చు. సెల్ఫోన్ గురించి 86వ పద్యంలో చక్కటి విషయాన్ని తెలియజేశాడు

"కరమునందునెపుడు చరవాణి
బట్టియు చూచుచుండ నరుని
చూపుపోవు వాడుకొనుము
దాని వార్త జేరు కొరకు
రాజు జెప్పు మాట రాచబాట"

ఇందులోని మొత్తం పద్యాలు అన్నీ కూడా ఆణిముత్యాలు చెప్పవచ్చు . ఒక్కో పద్యం ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంది అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. ఇలాంటి చక్కటి పద్యాలు యువ కవి కాల్వ రాజయ్య గారి కలం నుండి మరెన్నో జాలువారాలని కోరుకుంటూ, ఆది గ్రంథం తోనే అందనంత ఎత్తుకు సాహిత్యంలో ఎదగాలని కోరుకుంటూ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేద్దాం. పుస్తక ముఖ చిత్రం అందంగా ఆకర్షణీయంగా ఉంది. విద్యార్థి భావి జీవితానికి రాచబాటగా ఊహించవచ్చు. చక్కటి సందేశాత్మకంగా చిత్రాన్ని ముఖ చిత్రంగా ఎంపిక చేసుకోవడం గొప్ప విషయం.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008





వెలిమెల–విద్యుత్‌నగర్‌లను

తెల్లాపూర్ డివిజన్‌లోనే కొనసాగించాలి

- తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 4 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వెలిమెల, న్యూ ఎంఐజీ విద్యుత్‌నగర్ కాలనీలను తెల్లాపూర్ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు భారీగా ఆందోళనకు దిగారు. విద్యుత్‌నగర్‌లో నిర్వహించిన ఈ రిలే నిరాహార దీక్షకు తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి నాయకత్వం వహించారు. వెలిమెలను ముత్తంగి లోకి, న్యూ ఎంఐజీ విద్యుత్‌నగర్ ను భారతి నగర్ డివిజన్‌లో కలపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం, ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెలిమెల, విద్యుత్‌నగర్ ప్రాంతాలను తెల్లాపూర్ డివిజన్‌లోనే కొనసాగించాలని స్పష్టం చేశారు. సర్కిల్ కార్యాలయాన్ని కూడా తెల్లాపూర్ లోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.. ప్రభుత్వం స్పందించకపోతే రిలే నిరాహార దీక్షను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకూ వెనుకాడబోమని హెచ్చరించారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకు విజన్ లేదు

- సీఎం రేవంత్ రెడ్డి ఏదో చేస్తాడని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది
- ఎంపీ. రఘునందన్ రావు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 4 : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ఐబీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గం ముఖ్య నేతల సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు. అనంతరం పాలమూరు, కృష్ణా జలాలపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రఘునందన్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర శాసనసభలో పాలమూరు, కృష్ణా జలాలపై చిత్తశుద్ధితో చర్చ జరగడం లేదని విమర్శించారు. అసెంబ్లీ వేదికగా ఒకరినొకరు తిట్టుకోవడానికే అధికార, ప్రతిపక్షాలు పరిమితమయ్యాయని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాల విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ ఢిల్లీలో సంతకాలు చేసిన పత్రాలను ప్రజల ముందుంచామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారునిగా కేసీఆర్ ఎంత టీఎంసీలు సరిపోతాయో అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. పాలమూరు జిల్లా వలసల జిల్లాగా మారినా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గానీ, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో, ఎలాంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి ఏదో చేస్తాడని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకు విజన్ లేదని, నాణానికి బొమ్మ-బొరుసులా మారాయని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో మంత్రులు, ప్రతిపక్ష నేతలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. "ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని" లక్ష్యంతో బీజేపీ నదుల అనుసంధాన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టిందని తెలిపారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అవినీతి ఆరోపణలకే పరిమితమయ్యారని అన్నారు. పాలమూరు ప్రజలను రెండు పార్టీల సీఎంలు మోసం చేశారని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, పాలమూరు ప్రజలకు న్యాయం చేసేది బీజేపీ మాత్రమేనని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.



గంజాయి రవాణాను భగ్నం చేసిన పోలీసు సిబ్బంది

- అభినందించి క్యాష్ రివార్డు అందజేసిన జిల్లా ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 4: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన ఆపరేషన్ కవచ్ కార్యక్రమం గణనీయమైన ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా అంతరాష్ట్ర దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తగదల, గంజాయి రవాణా వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు జిల్లాలో నేరలను అదుపులోకి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి వేళల్లో జిల్లా వ్యాప్తంగా ప్రతీ వాహనం కూడా తనిఖీ చేయబడుతున్నాయి. ఆపరేషన్ కవచ్ లో భాగంగా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సన్నపల్లి చౌరస్తా వద్ద రాత్రి సమయంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ బృందం అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడం జరిగింది. ఈ క్రమములో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆటోను కూడా ఆపి అనుమానంతో పూర్తిగా తనిఖీ చేయగా అందులో ఏర్పడకుండా దాచిన గంజాయిని గుర్తించారు. వెంటనే ఆటోలో గంజాయిని తరలిసుతున్న ముగ్గురు నిందితులను పట్టుకొని దేవునిపల్లి పోలీస్ స్టేషన్ నందు అప్పగించగా, దేవునిపల్లి పియస్ అధికారులు వారిపై కేసు నమోదు చేసి ముగ్గురు నేరస్తులను అరెస్టు చేయడం జరిగింది. రాత్రి తీవ్ర చలిలోనూ విధులు నిర్వహిస్తూ అప్రమత్తతతో వ్యవహరించి గంజాయి రవాణా చేస్తున్న నేరస్తుల పట్టివేతలో కీలక పాత్ర పోషించిన ఆరు గురు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర క్యాష్ రివార్డుతో సత్కరించారు.

ఎన్ని రకాల ఒత్తిడిలున్నా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 4 : ఎన్ని రకాల ఒత్తిడిలున్నా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్ లో ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యే వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉచిత హెల్త్ క్యాంప్ కి సన్రైజ్ హాస్పిటల్, మనోరమ హాస్పిటల్ కు చెందిన వైద్యులు పాల్గొని వివిధ ఆరోగ్యపరమైన పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, బీపీ చెకప్, ఆర్థోపెడిక్, దంత సమస్యలు, గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు, నరాలకు సంబంధించిన వైద్యులు, కంటి చూపుకు సంబంధించిన వైద్యులు తో సహా తొమ్మిది మంది డాక్టర్లచే హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్ని రకాల ఒత్తిడిలు ఉన్న ఆరోగ్యాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఆర్య వైశ్యులు కూడా పేద వారు చాలామంది ఉన్నారని అర్హులైన వారందరికీ తన నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే ఈ మెగా హెల్త్ క్యాంప్ లో పాల్గొన్న వైద్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముక్కా దేవేందర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు దన్పాల్ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, గాలి నాగరాజు గుప్తా, లాబి శెట్టి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 4: ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మక్తల్ మండలం సత్యవరం గ్రామానికి చెందిన పాషా (22) ఆదివారం ఉదయం చికెన్ వ్యాపారానికి అవసరమైన కోళ్ల కోసం ద్విచక్ర వాహనంపై మక్తల్‌కు వస్తుండగా, మక్తల్ నుంచి సిమెంటు లోడుతో ఆత్మకూరు వైపు వెళ్తున్న బోలోరో భూత్పూర్ గ్రామ పరిసరాల్లోని రిజర్వాయర్ దిగువ డ్యాం క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాషాకు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన బోలోరో వాహనదారుడు గాయపడిన వ్యక్తిని పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



డిప్యూటీ సీఎంను కలిసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ

ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 4: నూతన సంవత్సరం సందర్భంగా శనివారం ప్రజాభవన్ లో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని ఎన్పీడీసీఎల్ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, సంస్థ డైరెక్టర్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వినియోగదారులకు మరింత మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని కోరారు. విద్యుత్ డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిపాదించిన అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డితో పాటు సంస్థ డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి.తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి.ప్రభాకర్ పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 4: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. జోగలాంబ గద్వాల జిల్లాకు చెందిన బి. లావణ్య సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో హౌజ్ సర్జన్ గా చేస్తూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇంటర్న్షిప్ చేస్తోంది. శుక్రవారం ఉదయం లేబర్ రూంలో డ్యూటీలో ఉండగా అనారోగ్యంగా ఉండడంతో క్యాజువల్ వార్డ్ లో చికిత్స పొంది. మెడికల్ కళాశాల హాస్టల్ కు వెళ్లి భోజనం చేసి నిద్రించింది. శనివారం ఉదయం పారాక్విట్ గడ్డి మందు ఇంజక్షన్ శరీరం లోకి తీసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. ఇది గమనించిన తోటి జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పట్టణంలోని లోహిత్ సాయి హాస్పిటల్ కు తరలించి డయాలసిస్ చేశారు. అనంతరం అక్కడి నుండి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి కి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున జూనియర్ వైద్యురాలు లావణ్య మృతి చెందింది. జనరల్ మెడిసిన్ విభాగంలో పనిచేస్తున్న జూనియర్ వైద్యుడితో ప్రేమ వ్యవహారం విఫలం కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి డాక్టర్లు చర్చించుకుంటున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సదరు వైద్యుడు మృతురాలి కుటుంబ సభ్యులతో సెటిల్మెంట్ వ్యవహారం మాట్లాడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం.



మోడల్ స్కూల్ ను సందర్శించిన ఎంపీ

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 4: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో నెల ప్రభుత్వ మోడల్ స్కూల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతి గృహంలో కల విద్యార్థులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి మౌలిక ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతుందన్నారు. పాఠశాల మౌలిక వసతులు విషయంలో తన వంతు సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- హార్ట్ ఎటాక్ ముసుగులో హత్య
- మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో వెలుగు చూసిన ఘటన
- భార్యతో పాటు ఆరుగురి అరెస్టు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 4 : ప్రియుడితో కలిసి భర్తను, హత్య చేసిన భార్యను, ఆమెకు సహకరించిన ఐదుగురుని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన కు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు పల్లాటి రమేష్ భార్య పల్లాటి అరుణ లత కు నందిపేట్ మండలం బాద్గుణ కు చెందిన నాలేశ్వర్ దిలీప్‌తో అక్రమ సంబంధం ఉన్నట్లు రమేష్ గుర్తించాడు. ఈ అక్రమ సంబంధం విషయం గురించి మృతుడు తరచూ భార్య పై అనుమానాలు వ్యక్తం చేయడం తో భర్తను ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలని భార్య అరుణాలత తన ప్రియుడి తో కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఇందులో భాగంగా గత ఆగష్టు నెలలో మృతుడు రమేష్ ఆర్మూర్ నుండి నిజామాబాద్ కి తన బైక్ పై వస్తుండగా చిన్నాపూర్ గండి వద్ద, నాలేశ్వర్ దిలీప్ అతని తమ్ముడు కలిసి కార్ తో గుద్ది చంపడానికి ప్రయత్నిచగా అది విఫలం అయినది. అయితే ఈ ఆక్సిడెంట్ ను పైన తెల్పిన వ్యక్తులు చేసినట్లు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చేసినట్లు గా మృతుడు మాక్లూర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు నమోదు చేశాడు. అనంతరం డిసెంబర్ మూడవ వారంలో మృతుడి భార్య తన ప్రియుడితో కలిసి , వేరే వ్యక్తు ల తో తన భర్త ను చంపివేద్దామని పథకం వేసింది. దాంతో ఆమె బంగారు రింగ్ ను ప్రియుడు దిలీప్ కు ఇవ్వగా అట్టి రింగ్ ను ముథూట్ ఫైనాన్స్ లో కుదవ పెట్టగా వచ్చిన డబ్బు తో దిలీప్ తన తమ్ముడు అయిన మాధాపూర్ గ్రామానికి చెందిన అభిషేక్ ను సంప్రదించగ, అభిషేక్ అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు అయిన బంటు జితేందర్ ను దిలీప్ కు పరిచయం చేశాడు. జితేందర్ ద్వారా వేనుకిసాన్ నగర్ తండా కు చెందిన కెలోత్ శ్రీరామ్ అలియాస్ బబ్లూ, రమావత్ రాకేశ్, వారి స్నేహితుడు అయిన మోసిన్ ల కు పరిచయం చేయగా బంగారం ఉంగరం అమ్మగా వచ్చిన రూ.35 వేలు పల్లటి రమేశ్ ను చంపాలని సుపారీ గా శ్రీరామ్, రాకేశ్ , మోసిన్ ల కు గత నెల 16న అడ్వాన్స్ గా రూ 20 వేలు, 19న రూ 15వేలు ఇచ్చి హత్య చేయడానికి పథకం పన్నారు. అయితే అదే రోజు మృతుని భార్య రాత్రి భోజనం అనంతరం తన భర్త కు మంచి నీటి లో సుమారు పది నిద్రమాత్రలు కలిపి ఇవ్వగా మృతుడు గాఢ నిద్ర లో కి జారుకోగా ఆమె తన ప్రియుడు దిలీప్ కు ఫోన్ చేసి చెప్పగా దిలీప్ సుపారీ తీసుకున్నటు వ్యక్తుల కు ఫోన్ చేయగా వారు ఫోన్ ఎత్తలేదు. సదాంతో ఎలాగైనా రమేశ్ ను చంపాలని నిర్ణయించుకొని దిలీప్ తనకు వరసకు తమ్ముడు అయిన మాధాపూర్ లో ఉండే యెర్రోల్ల అభిషేక్ దగ్గరికి వెళ్ళి అతనికి విషయం చెప్పి ఇద్దరు కలిసి దిలీప్ బైక్ పై బొర్గామ్ కే గ్రామానికి వెళ్ళి, మృతుని భార్య సహాయంతో ఇంట్లోకి వెళ్ళి , అప్పటికే నిద్రలో ఉన్న రమేశ్ మెడ పై టవల్ సహాయం తో ఉరివేసి, దిండు సహయం తో ముక్కు, నోరు ను అధిమి పట్టి ఊపిరి ఆడకుండా చేసి, చంపివేసి అక్కడి నుండి వెళ్ళిపోయినారు. తరువాత ఉదయం మృతుని భార్య తన భర్త రమేష్ హార్ట్ ఎటాక్ తో చనిపోయడని కుటుంబ సభ్యులను, బంధువులను నమ్మించ గా ఆమె మాటలు నమ్మి అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. కేసును సాంకేతిక ఆధారాలు, అన్నీకోణాలలో లోతు గా దర్యాప్తు చేసి ఆదివారం హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న మృతుని భార్య పల్లటి అరుణలత , ఆమె ప్రియుడు నాలేశ్వర్ దిలీప్, అతని తమ్ముడు యెర్రోల్ల అభిషేక్ హత్య కు సంబంధించి కుట్ర లో భాగంగా ఉన్న సుపారి గాంగ్ అయిన బంటు జితేందర్, శ్రీరామ్ , రమావత్ శ్రీకాంత్ ల ను పోలీసులు అదుపు లో కి తీసుకున్నారు. పోలీసుల విచారంలో నిందితులు నేరాన్ని అంగీకరించగ వారిని అరెస్టు చేశారు. సుపారి గాంగ్ లో ని మరోక సభ్యుడు అయిన మోసిన్ పరారీ లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇట్టి కేసును ఛేదించిన నిజామాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్, ఎల్.రాజా వెంకట్ రెడ్డి అధ్వర్యంలో బి.శ్రీనివాస్ నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎం. రాజశేఖర్ సబ్ ఇన్స్పెక్టర్ పిఎస్ మాక్లూర్, సిబ్బంది కేసును వివిధ కోణాలలో పరిశోధించి నిందితులను పట్టుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బంది రాజేశ్వర్, చందు, బాలాలింగం, రాకేశ్, రామకృష్ణ, శ్రీనివాస్, శ్రీకర్ గౌడ్, లక్ష్మీప్రసన్న, రచిత, బాబునాయక్, శ్రీకాంత్ గౌడ్, దత్తాద్రి గౌడ్, వెంకటస్వామి, సురేందర్, చరణ్ లను నిజామాబాద్ ఏ సీ పీ ఎల్.రాజా వెంకట్ రెడ్డి, అభినందించారు.



ముంపు గ్రామాల ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జ్ 'వంటేరు'

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 4: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని గజ్వేల్‌లో బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీక్ష సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం నాడు వంటేరు ప్రతాప్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటిగడ్డ కిష్టాపూర్‌లో దీక్ష సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిపోయారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముంపు గ్రామాల ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గల్ ఇండస్ట్రియల్ భూసేకరణ సమయంలో కాంగ్రెస్ నేతలు ఎకరాకు 60 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసిన ఆయన, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ గజ్వేల్ పర్యటనకు వస్తే వర్గల్ మండల రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గజ్వేల్ కాంగ్రెస్ నిరుద్యోగులు కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద ధర్నాలు చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ద్వారా సాగునీరు, ప్రతి ఇంటికి గోదావరి నల్లనీరు, రింగ్ రోడ్లు, డబుల్ రోడ్లు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, మార్కెట్లు, ఆడిటోరియంలు, ఎడ్యుకేషన్ హబ్‌లతో గజ్వేల్ రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు, ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, పనికిమాలిన ధర్నాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నియోజకవర్గ, మండల స్థానిక నాయకుల తోపాటు సర్పంచులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డితో చంద్రబాబు కుదుర్చుకున్న రహస్య ఒప్పందాలు రాయలసీమకు మరణశాసనంగా మారాయి. స్వార్థం కోసం రాయలసీమ లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టును అడ్డుకున్నారు. గతంలో ఆల్మట్టి, పోలవరం, ప్రత్యేక హోదా విషయంలోనూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. అధికారం కోసం రాష్ట్రాన్ని చంద్రబాబు దెబ్బతీస్తున్నారు.

- అంబటి రాంబాబు, ఏపీ మాజీ మంత్రి

ప్రాంతీయం



విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- చదువుతోనే సమాజ చైతన్యం సాధ్యం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 4: విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారం బీసీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారంతో వచ్చిన 55 దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.కలెక్టర్ ముందుగా హాస్టల్ పరిసరాలు,విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, భోజన మెనూ,నిత్యావసరాల స్టోర్‌రూమ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేస్తూ నిరుపేద విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు,సమృద్ధమైన మౌలిక వసతులతో కార్పొరేట్ స్థాయి విద్యాబోధన జరుగుతోందని తెలిపారు.కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించగా, హాస్టల్ వసతులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. చలికాలంలో దుప్పట్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, జాగ్రత్తగా వినియోగించుకుంటామని విద్యార్థులు తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత బీసీ హాస్టల్ వార్డెన్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమాజ చైతన్యంలో రాచబాట శతకం తోడ్పడుతుంది

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 4: సమసమాజ మార్పుకు సాహిత్యం అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్ సిద్దిపేటలో కాల్వ రాజయ్య రచించిన రాచబాట పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన కేడం లింగమూర్తి మాట్లాడుతూ... పండిత పామరులను అలరించేది పద్యమని, పద్యాలు ప్రజలలో చైతన్యం తెస్తుందన్నారు. విశిష్ట అతిథి అవుసుల భానుప్రకాష్ మాట్లాడుతూ పద్యం అజరామరం వరకవి సిద్దప్ప వారసులుగా కాల్వ రాజయ్య రచనలు ఉన్నాయన్నారు. నదీ తీరాలలో సాహిత్యం ఫరిడవిల్లుతుందని, సాహిత్యం మనిషిని పరమోన్నతుడౌతాడని, సమాజానికి దిశానిర్దేశం చేసేది కవులన్నారు. విశాలభావంతో రచనలు సాగాలన్నారు. అక్షరసృష్టి ఆగదంటూ, అలతి అలతి పదాలతో అద్భుతమైన రచనలు చేయవచ్చని చరిత్రలో నిల్చిపోయేలా రాచబాట శతకం ఉందన్నారు. గొర్రె కాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ పశువుల కాపరులుగా సాహిత్య సృజన చేసిన మహనీయులు చరిత్రతో పాటుగా పల్లె అందాలలోని సాహిత్యాంశాలు తెలిపారు. రాచబాట పుస్తక రచయిత కాల్వ రాజయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ళ రాజేశం, పిట్ల దాసు, మామిండ్ల ఐలయ్య యాదవ్, ఐతా చంద్రయ్య, కొండి మల్లారెడ్డి, రాజమౌళి, ఎల్లం యాదవ్, బాలయ్య, అశోక్, గంగారాం, అంజయ్య, సరస్వతీ రామశర్మ, వెంకటేశ్వర్లు, మహేంద్రారెడ్డి, నరసింహారావు, మల్లికార్జున్, చంద్రశేఖర్, రాజు, లక్ష్మయ్య, రాజ్ కుమార్, బాల్ నర్సయ్య, అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 4: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్.అంబేద్కర్ అలోచనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ లు పాలకులుగా మారినందున గ్రామాలను ఆదర్శంగా మార్చాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లాలోనీ ఎస్సీ, ఎస్టీ సర్పంచు, ఉప సర్పంచులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వెంకటయ్య పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ప్రధాన పాత్ర పోషించాలని చెప్పారు. పదవి పొందిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలకు అతీతంగా నిధులు సేకరించి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అరకొర నిధులున్న ప్రస్తుత తరుణంలో ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్ళాలని సూచించారు.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తూ నిరంతరం పాలకులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు. గ్రామంలో గెలిచిన సర్పంచ్, వార్డు సభ్యులు పార్టీలకు అతీతంగా సేవలందించాలని, గ్రామంలో ఐక్యత చేయాలన్నారు. ఉత్తమ సర్పంచులుగా అవార్డులు సాధించాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా సేవలందించాలని కోరారు. గ్రామాలలో పిల్లలను ఉన్నత చదువు చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి. శంకర్, ప్రతినిధులు మెట్ల శంకర్, ఎగొండ స్వామి, భీమ్ ధేఖర్ పొతరాజుశంకర్, తిరుపతి, ఎంపిటిసిల ఫోరమ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్, తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ , బ్యాగరి వేణు, సుల్తానా, పుట్ట రాజు, రాంచద్రం తదితరులు పాల్గొన్నారు.



సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కుమార్

ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి 4: సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఫోరం అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఫోరం మండల అధ్యక్షుడిగా మండల కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాల మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సర్పంచుల సమస్యలను పరిష్కరిస్తానని వెల్లడించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచులకు సూచించారు. తమపై నమ్మకంతో సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్న తోటి సర్పంచులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు.

కేసీఆర్ ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

- డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి ఆధ్వర్యంలో మెరుపు ధర్నా



ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 4: ప్రతిపక్షనేతగా సకల వసతులు పొందుతున్న కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవల్లిలో కేసీఆర్ ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం మెరుపు ధర్నాకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. డీసీసీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో వందలాదిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఒక్కసారిగా పోలీసుల కన్నుగప్పి ఎర్రవల్లి కేసీఆర్ ఫాంహౌజ్ వద్దకు చేరుకున్నారు. అనంతరం గేటు ముందు ఎర్ర తివాచి పరిచి పూలు చల్లుతూ కేసీఆర్ బయటకు రావాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లాలని, సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, గజ్వేల్ ఎమ్మెల్యేగా ఇక్కడి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని డిమాండ్ చేస్తూ రెండు గంటలకు పైగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఫాంహౌజ్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కేసీఆర్ వద్దకు వెళ్లి వినతి పత్రం అందిస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేసినప్పటికీ పోలీసులు అంగీకరించకపోవడంతో వారిమధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. కెసిఆర్ నుండి అనుమతి లేనిదే కాంగ్రెస్ నేతలను లోనికి అనుమతించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆందోళన తీవ్ర రూపం దాల్చుతుండడంతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను శాంతింపజేశారు. ఇక్కడి ప్రజల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయ మోహన్, నాచగిరి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హంగామాపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు



ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు నివాసం వద్ద అనుమతి లేకుండా హంగామా సృష్టించిన కాంగ్రెస్ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మర్కుక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలు ఆదివారం నాడు ఎర్రవల్లి కేసీఆర్ నివాసం ముందు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా హడావుడి చేయడంతో భయభ్రాంతులు నెలకొన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై నర్సారెడ్డిపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మర్కుక్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మర్కుక్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు మా నాయకుడిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడే హక్కు వారికి లేదు. వారు తమ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు ప్రశ్నించాలి. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసింది. దమ్ముంటే ఇప్పటి ప్రభుత్వం అంతకు మించి అభివృద్ధి చేసి చూపాలి," అని అన్నారు. ఇలాగే ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు

దేవులపల్లి రమేశ్‌కు ఆహ్వానం

ప్రతిపక్షం, నంగునూర్, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ,గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు, సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండల కేంద్రానికి చెందిన రచయిత, కవి బీసీ గురుకుల,ఎంజేపీ తెలుగు అతిధి ఉపాధ్యాయులు దేవులపల్లి రమేశ్, ఆహ్వానం అందుకున్నారు.ఆంధ్ర సారస్వత పరిషత్తు,ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు, ఈనెల 3వ తేది నుండి 5వ తేదీలలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల సదస్సులో పాల్గొనవలసిందిగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్,తెలుగు మహాసభల సమన్వయకర్త, పి. రామచంద్ర రాజు, కొల్లి రమావతి, ఆహ్వానం పంపారు.3వ ప్రపంచ తెలుగు మహాసభలకు అవకాశం రావడం చాలా సంతోషకరమని, తెలుగు భాష గొప్పతనం, గురించి కవితా గానం చేస్తున్నట్లు, కవి దేవులపల్లి రమేశ్ పేర్కొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 4: శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు చలికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు బొకేలు బదులు విద్యార్థులకు ఉపయోగపడే దుప్పట్లు రగ్గులు అందించాలని విస్తృత ప్రచారం చేసిన నేపథ్యంలో దీనికి స్పందించిన జిల్లా అధికారులు, వారి సిబ్బంది ప్రజా ప్రతినిధులునూతన సంవత్సర సందర్భంగా పెద్ద ఎత్తున అందించిన బ్లాంకెట్స్ నార్సింగ్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు 65 బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... ప్రభుత్వ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులు అన్ని సౌకర్యాలతో చదువుకోగలిగే వాతావరణాన్ని ఏర్పరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.



26వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 4: సిద్దిపేట పట్టణంలోని 26వ వార్డులో మిగిలి ఉన్న సీసీ రోడ్డు పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు స్థానిక కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ తో కలిసి ప్రారంభించారు. 26వ వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం వార్డులో కలియ తిరుగుతూ స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మంజుల రాజనర్సు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దేవర మల్లారెడ్డి,మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, శ్రీను శోభ, విజయ, పద్మ, లత, అనూష, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



హలో కామ్రేడ్... ఛలో ఖమ్మం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 4: సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సిద్దిపేట జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి బహిరంగ సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం నుంచి నేటివరకు ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ సీపీఐ అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఫాసిస్టు బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనుకుంట్ల శంకర్, కొమ్ముల భాస్కర్, బట్టు దయానందరెడ్డి, ఎడల వనేశ్, అందె అశోక్, కిష్టపురం లక్ష్మణ్, జేరిపోతుల జనార్ధన్, పిల్లి రజిని, జిల్లా కౌన్సిల్ సభ్యులు బన్సీలాల్, ఎస్‌కే హారిఫ్, మిట్టపల్లి సుధాకర్, బోనగిరి రూపేష్, శివలింగు కృష్ణ, సుదర్శనచారి, ఆది రంగారెడ్డి, స్వర్గం రాజేశం, సంగెం మధు, రామగళ్ల నరేష్, కర్ణాల చంద్రం, బంక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.





మున్సిపల్ పీఠం ముదిరాజులకే రావాలి

- రాజకీయంగా ఎదగడానికి కలిసికట్టుగా పనిచేయాలి
- ముదిరాజ్ సర్పంచ్ ఉప సర్పంచ్ లకు సన్మానం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 4: మున్సిపల్ పీఠం ముదిరాజులకే వచ్చేలా ఐక్యంగా ముదిరాజులందరు కలిసికట్టుగా కృషి చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు తుపాకుల బాల్ రంగం, బైరి శంకర్, ధర్మ ముదిరాజ్, మేడికాయల వెంకటేశం అన్నారు. ఆదివారం నూతనంగా గెలుపొందిన సిద్దిపేట నియోజకవర్గ ముదిరాజ్ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పొన్నాల సమీపంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులుగా ముదిరాజులు గెలుపొందడం సంతోషంగా ఉందని ఇంకా అధిక సంఖ్యలో గెలిస్తే బాగుండేదని రాజకీయంగా అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. ముదిరాజ్ కులస్తులకు రాజకీయంగా మరింత అవకాశం రావాలని రాజకీయంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దానికి ముదిరాజులు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బర్ల మల్లికార్జున్, నల్ల శ్రీకాంత్,బైరి యాదగిరి, సర్పంచులు తోడేంగెల వెంకటేష్, ఇట్టబోయిన శ్రీనివాస్, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

“



గోదావరి జలాల్లో ఏపీ వాళ్లు ఒక్క బొట్టు వాడుకున్నా సహించేది లేదని బీఆర్ఎస్‌నేతలు అన్నారు. యేడాదికి 3 వేల టీఎంసీల గోదావరి నీళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. బీఆర్ఎస్‌కు కౌంటర్‌గా రేవంత్ రెడ్డి కూడా వాడుకోవద్దు అంటున్నారు. ఇది సరికాదు. గోదావరి నీళ్లు రాయలసీమకు ఇస్తామని కేసీఆర్ కూడా గతంలో చెప్పారు.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే

తమిళనాడులో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- కుటుంబ పాలనకు స్వస్తి చెప్ప సమయం ఆసన్నమైంది
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, చెన్నై, జనవరి 4: దేశంలో గత రెండేండ్లలో బీజేపీ వరుస విజయాలు సొంతం చేసుకుందని, 2026లోనూ తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ఎన్డీయే ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా పుదుక్కోటలో ఆదివారంనాడు ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈసారి తమిళనాడులోని కుటుంబ పాలనకు ముగింపు పలుకుతామని చెప్పారు. 'తమిళనాడులో కుటుంబ పాలనకు స్వస్తి చెప్పేందుకు సమయం ఆసన్నమైంది. మొదట కరుణానిధి, ఆ తర్వాత స్టాలిన్, ఇప్పుడు ఉదయనిధిని ముఖ్యమంత్రిని చేయాలని కలలు కంటున్నారు. ఆ కలలు నెరవేరవు' అని అమిత్‌షా అన్నారు. ప్రజాసంక్షేమం కంటే వారసత్వ రాజకీయాలకే డీఎంకే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రాధాన్యతనిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా ఉదయనిధిని తదుపరి సీఎం చేయాలన్న తాపత్రయం మాత్రమే డీఎంకేలో కనిపిస్తోందని అన్నారు. తమిళనాడులో మహిళలకు భద్రతకు గ్యారెంటీ లేదని, శాంతిభద్రతలు లోపించాయని విమర్శించారు. దీనికి ముందు, తన పర్యటనలో భాగంగా తిరుచిరాపల్లి విమానాశ్రయానికి చేరుకున్న అమిత్‌షాకు పార్టీ సీనియర్ నేతలు, కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అమిత్‌షా రాక కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. 2026 ఎన్నికల్లో పార్టీని పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ వ్యూహాలపై బీజేపీ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నేతలతో అమిత్‌షా సమావేశమయ్యారు.





50లోనూ యంగ్‌గా ఎలా?

మహిళలు అందానికి ఇచ్చినంత విలువ దేనికీ ఇవ్వరు.. వయసు పైబడుతున్న కొద్దీ తమ వయసును కాపాడుకునేందుకు చాలా కష్టపడుతుంటారు. స్త్రీలు ఇంట్లో అందరి బాగోగులు చూసుకుంటారు. భర్త నుండి పిల్లల వరకు, కానీ తమ సంరక్షణ విషయంలో కొన్ని కొన్ని సార్లు రాజీ పడుతుంటారు. అటువంటి పరిస్థితిలో, 50 ఏళ్లు దాటిన మహిళలు తమ ఆరోగ్యాన్ని, అందాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడానికి, ఆరోగ్యంగా ఉండటానికి మెరుగైన ఆహారాన్ని, జీవన విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం.
వయసు పెరుగుతున్న కొద్దీ తమను తాము ఫిట్‌గా ఉంచుకోవడం మహిళలకు పెద్ద సవాలు. మహిళలు ఇంట్లో అందరినీ చూసుకుంటారు కానీ తమను తాము చూసుకోవడం మర్చిపోతారు. వారి వయస్సు 50కి చేరుకోగానే శరీరంలో అనేక రకాల సమస్యలు మొదలవుతాయి. మహిళలు తమ వయస్సు కంటే పెద్దగా కనిపించడానికి కారణం ఇదే. అటువంటి పరిస్థితిలో, 50 ఏళ్లు దాటిన మహిళలు మంచి ఆహారాన్ని అనుసరించడం మరియు మంచి దినచర్యను పాటించడం చాలా ముఖ్యం, తద్వారా వారు కూడా వయస్సుతో తమను తాము ఫిట్‌గా ఉంచుకోవచ్చు. 50 ఏళ్లు దాటిన మహిళలు తమ ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవడానికి కొన్ని ప్రత్యేక చిట్కాలు ఉన్నాయి.

క్రమం తప్పకుండా వ్యాయామం

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఎముకల బలం, కండరాల బలం మరియు గుండె ఆరోగ్యం మెరుగుపడతాయి. అందువల్ల, ఉదయం తేలికపాటి వ్యాయామం చేయడానికి ప్రయత్నించండి. ఇంటి పనుల్లో బిజీగా ఉండే మీకు ఉదయం సమయం దొరకకపోతే సాయంత్రం వ్యాయామం చేయండి.

మంచి ఆహారం

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి, వయసురీత్యా వచ్చే వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందువల్ల, మీరు మీ ఆహారంలో మంచి ఆహారం తీసుకోవడం ముఖ్యం.



పుష్కలంగా నిద్రపోవాలి

తగినంత నిద్ర పొందడం వల్ల శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. చాలా సార్లు, నిద్ర లేకపోవడం వల్ల, మీ శరీరంలో అనేక మార్పులు జరుగుతాయి. ఇది ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది.

చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోండి


చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం వల్ల చర్మం పొడిబారడం మరియు ముడతలు తగ్గుతాయి. అందువల్ల, మీ చర్మాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోండి. స్కిన్ మీ ప్రెజెంటేషన్ మీ చర్మం మెరుస్తూ ఉండకపోతే, మీరు పెద్దవారిగా కనిపిస్తారు.


మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి

మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన మరియు డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స చేయవచ్చు. సామాజిక సంబంధాలను నిర్వహించండి సామాజిక సంబంధాలను నిర్వహించడం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మరియు ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఈ చిట్కాలను పాటించడం ద్వారా, 50 ఏళ్లు దాటిన మహిళలు తమ ఆరోగ్యాన్ని మరియు అందాన్ని కాపాడుకోవచ్చు మరియు ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు.







విశ్వ వీక్షణం



వెనెజులా తర్వాత టార్గెట్ వాళ్లే..

- క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ వార్నింగ్

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలా తాత్కాలికంగా తమ ఆధీనంలోనే ఉంటుందని ప్రకటించిన ట్రంప్.. లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలైన క్యూబా, మెక్సికో, కొలంబియాలకు సైతం వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ తయారీ, మాదక ద్రవ్యాల ముఠాలకు క్యూబా, మెక్సికో, కొలంబియా దేశాలు ఆశ్రయమిస్తున్నాయని, అక్కడి నుంచి అమెరికాలోకి అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కారణంతో వెనెజువెలాపై సైనిక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆ దేశాలు తమ పద్ధతి మార్చుకోకపోతే వెనెజువెలా పరిస్థితినే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాల్లోని డ్రగ్స్ ఉత్పత్తి ల్యాబ్‌లపై దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.ముఖ్యంగా కొలంబియాపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. కొలంబియాలో మూడు ప్రధాన కొకైన్ తయారీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వాళ్లే కొకైన్‌ను తయారు చేసి, అమెరికాకు పంపిస్తున్నారని.. అందుకే అతను జాగ్రత్తగా ఉండాలంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి హెచ్చరించారు. కాగా, వెనెజువెలా అధ్యక్షుడిని అమెరికా సైన్యం బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో దేశాలు ఖండించాయి. ఇది దురాక్రమణ కిందకే వస్తుందని స్పష్టం చేశాయి. ఈ పరిణామాలు దక్షిణ అమెరికా మొత్తం భద్రతకు ముప్పుగా మారిందని పేర్కొన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని.. వెనెజువెలా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు.



ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సన్నద్ధం


- ప్రధాని నరేంద్ర మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 4: 'ఒలింపిక్స్2036' క్రీడల నిర్వహణకు భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. గత పదేళ్లలో అంతర్జాతీయ క్రీడలకు భారత్ వేదికగా నిలిచిందని చెప్పారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లో 20కిపైగా అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించామని ప్రధాని గుర్తుచేశారు. అండర్17 ఫిఫా వరల్డ్‌కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందన్నారు. 2030లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని తెలిపారు. 2036లో ఒలింపిక్ క్రీడల కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత్ అభివృద్ధి వృత్తాంతాన్ని ప్రధాని మోదీ వాలీబాల్ క్రీడతో పోల్చారు. ఏ విజయమైనా ఒక్కరితో సాధ్యం కాదనే విషయాన్ని ఈ వాలీబాల్ క్రీడ తెలియజేస్తుందని, మన సమన్వయం, విశ్వాసం, జట్ల సంసిద్ధతపైనే మన విజయం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి పాత్ర, బాధ్యత ఉంటుందని, వాటిని నెరవేర్చినప్పుడే మనం విజయం సాధిస్తామని చెప్పారు.కాగా జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 58 జట్లకు చెందిన వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలతో వారణాసి నగరం జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా మారుతుందని వాలీబాల్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకులు చెబుతున్నారు.

ట్రంప్ చేశాడు.. మీరెందుకు చేయరు

- ప్రధాని మోడీపై అసదుద్దీన్ విమర్శలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 4: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన ఘటనపై ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వెనెజువెలాలో సైనిక చర్యలు చేపట్టి అక్కడి అధ్యక్షుడినే బంధించినప్పుడు.. మీరు పాకిస్థాన్‌కు వెళ్లి 26/11 ఉగ్రదాడికి పాల్పడిన మాస్టర్‌మైండ్స్‌ను పట్టుకురావచ్చు కదా అని ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ట్రంప్ చేసినప్పుడు మీరెందుకు చేయలేరని ప్రశ్నించారు. మోదీజీ.. ముంబై దాడులకు కుట్రలు పన్నిన క్రూరులు.. అది మసూద్ అజర్ అయినా సరే.. లష్కరే తోయిబా ఉగ్రవాదులైనా సరే పాకిస్థాన్ నుంచి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక నియంత్రణతో కూడిన విధానాన్ని అనుసరిస్తుందని బీజేపీ ఎంపీ గులాం అలీ ఖటానా తెలిపారు. ప్రధాని మోదీ పాలనలో ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకుంటాం తప్ప.. దేశాలను కాదని స్పష్టం చేశారు. భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని.. మనం పొరుగు దేశాలు చిన్నవైనా, పెద్దవైనా వాటితో స్నేహపూర్వకంగానే ఉండటం మన బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రభావితం కావడం లేదని చెప్పారు. బిహార్ మంత్రి దిలీప్ జైస్వాల్ కూడా ఒవైసీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒవైసీ ఎప్పుడూ హెడ్‌లైన్లలో రావాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇప్పుడు ఒవైసీ ట్రంప్‌నకు కూడా సలహాలు ఇస్తున్నారని.. ఆయన సలహాలను ట్రంప్ కూడా పరిగణనలోకి తీసుకుంటాడేమో అని సెటైర్లు వేశారు.

అసోం స్క్రీనింగ్‌కమిటీ చైర్ పర్సన్‌గా ప్రియాంక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 4: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాం స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆమెను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికార ప్రకటన విడుదల చేశారు. ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలోని అస్సాం స్క్రీనింగ్ కమిటీలో సప్తగిరి శంకర్ ఉలక, ఇమ్రాన్ మసూద్, సిరివెల్ల ప్రసాద్ సభ్యులుగా ఉన్నారు.కాగా, అస్సాంతో పాటు, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లకు స్క్రీనింగ్ కమిటీలను కూడా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. కేరళ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ అధ్యక్షత వహిస్తారు. సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉంటారు.





టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు

భారత్‌లో ఆడలేం

- శ్రీలంకకు మార్చాలంటూ ఐసీసీకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి
- ఐపీఎల్ నుంచి రెహమాన్‌ను తొలిగించడంపై వివాదం

భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో క్రికెట్ వ్యవహారాలు కొత్త మలుపు తీసుకున్నాయి. గత కొన్ని నెలలుగా అన్చిశితి వాతావరణంతో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశ్‌లో క్రికెట్‌ను పావుగా మార్చుకుంటూ భారత ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓవైపు మైనార్టీ హిందువులను విచక్షణా రహితంగా చంపేస్తున్న తరుణంలో తాజాగా బీసీసీఐ లక్ష్యంగా బంగ్లా పావులు కదుపుతున్నది. ఐపీఎల్ నుంచి తమ దేశ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తీసివేయడాన్ని బూచిగా చూపిస్తూ త్వరలో భారత్‌లో మొదలయ్యే టీ20 ప్రపంచకప్ టోర్నీకి తమ దేశ జట్టును పంపించమంటూ బంగ్లా క్రికెట్ బోర్డు(బీసీబీ) సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. తమ దేశ క్రికెటర్ల భద్రత దృష్ట్యా బంగ్లా ఆడే మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలంటూ కొత్త పల్లవి అందుకుంది. ముస్తాఫిజుర్‌ను తీసేయాలంటూ కేకేఆర్ మేనేజ్‌మెంట్‌ను బీసీసీఐ ఆదేశించిన కొన్ని గంటల వ్యవధిలోనే అటు బంగ్లా అధికార వర్గాలతో పాటు బీసీబీ సభ్యులు హుటాహుటిన సమావేశమై..భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం సాయంత్రమే సమావేశమైన ఆ దేశ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్..బంగ్లాదేశ్ జట్టు ఎట్టి పరిస్థితుల్లో భారత్‌లో పర్యటించేది లేదని స్పష్టం చేశాడు. దీన్ని ఆసారాగా చేసుకుంటూ కొన్ని గంటల వ్యవధిలోనే నజ్రుల్ మాటలకు వంతపాడుతూ బీసీబీ పెద్దలు అధికారికంగా ఒక ప్రకటన వెలువరించారు. మెగాటోర్నీకి ముందు భారత్‌తో పాటు బీసీసీఐని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. అందుకు అనుగుణంగా ఫిబ్రవరి 7వ తేదీన భారత్‌లో మొదలయ్యే టీ20 ప్రపంచకప్ టోర్నీకి తమ జాతీయ జట్టును పంపవద్దని బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. 'గడిచిన 24 గంటలుగా జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. భారత్‌లో బంగ్లాదేశ్ ఆడే మ్యాచ్‌ల పరిస్థితిపై చర్చించాం. ప్రస్తుత పరిస్థితుల్లో తమ దేశ క్రికెటర్లతో పాటు సహాయక సిబ్బందికి భద్రత విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తాం. వారి సూచనలకు అనుగుణంగా భద్రతా కారణాల రీత్యా మెగాటోర్నీ కోసం భారత్‌లో పర్యటించవద్దన్న నిర్ణయానికి వచ్చాం. అక్కడ జరిగే మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలంటూ ఐసీసీకి విజ్ఞప్తి చేస్తున్నాం' అని బీసీబీ పేర్కొంది. ఓవైపు ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ రెహమాన్ తీసివేయడాన్ని సాకుగా చూపిస్తూ భారత్‌ను ఇరకాటంలో పెట్టేందుకు బంగ్లా ప్రభుత్వ పెద్దలు పిచ్చి ప్రయత్నాలు చేశారు. దేశ క్రికెట్ బోర్డు కంటే ముందే భేటీ అయ్యి భారత్‌పై బురద చల్లేందుకు ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా ఓవైపు తమ దేశ అంతర్గత భద్రతపై అన్ని దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కొత్త పల్లవి అందుకున్నారు. క్రికెట్ విషయంలో బీసీసీఐ మతాన్ని తీసుకొస్తుందంటూ ఆ దేశ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్ కొత్త భాష్యం చెప్పాడు.



తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం

- బ్రూక్, రూట్ హాఫ్ సెంచరీలు

మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొదటిసారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150 పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ఠ స్థితిలో నిలిచినట్టే. వరుసగా..పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.

మార్టిన్ కళ్లు తెరిచాడు


ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామిన్ మార్టిన్ కళ్లు తెరిచాడు. కొన్ని రోజులుగా కోమాలో ఉన్న అతడు ఆదివారం స్పృహలోకి వచ్చాడు. కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నాడు కూడా. దాంతో, ఇది కలా? నిజమా? అని డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు. కోమా నుంచి కోలుకున్న మార్టిన్ ఆరోగ్యం రోజురోజుకు మెరుగవుతోందని వైద్యులు తెలిపారు. త్వరలోనే అతడిని ఐసీయూ నుంచి వేరే వార్డుకు తరలిస్తామని చెప్పారు. ఒకప్పుడు విధ్వంసక ఆటగాడైన డామిన్ మార్టిన్ మెనింజిటైటిస్ జబ్బుతో బాధపడుతున్నాడు. 54 ఏళ్ల వయసున్న మార్టిన్ డిసెంబర్ 26న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో, కుటుంబసభ్యులు అతడిని వెంటనే బ్రిస్బేన్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మార్టిన్ అరోగ్యం మరింత క్షీణించడంతో ఐసీయూలో చికిత్స అందించారు. అతడు కోమాలోకి వెళ్లడంతో ఇక కోలుకోవడం కలే అనకున్నారంతా. కానీ, అనూహ్యంగా మార్టిన్ వారంలో రోజుల తర్వాత కళ్లు తెరిచాడు. మనుషులను గుర్తుపడుతూ.. మాట్లాడుతున్నాడు కూడా. అతడు వైద్యానికి వేగంగా స్పందిస్తున్నాడు అని వైద్యులు వెల్లడించారు.



ఇంకా భారత్‌కు అందని ఆసియా కప్

- మీడియా ప్రశ్నలకు నఖ్వీ కీలక వ్యాఖ్యలు

2025 సెప్టెంబర్ 28న ఆసియా కప్ ఫైనల్ లో పాకిస్థాన్ ను ఓడించి భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విజయం సాధించి దాదాపు నాలుగు నెలలు గడిచినా టీమిండియాకు మాత్రం విన్నింగ్ ట్రోఫీ అందలేదు. సాధారణంగా టోర్నమెంట్ గెలిచిన వెంటనే విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తారు. కానీ పీసీబీ ఆధ్యక్షుడు, ఏసీసీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటివరకు ఆ ట్రోఫీని భారత్‌కు ఇవ్వలేదు. అయితే తాజాగా ఆసియా కప్ 2025 ట్రోఫీపై నఖ్వీ కీలక కామెంట్స్ చేశారు. ఇటీవల కరాచీలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో నఖ్వీని ఈ ట్రోఫీ గురించి మీడియా అడిగింది. ఆయన సమాధానం ఇస్తూ.. ట్రోఫీ ఎక్కడ ఉన్నా సురక్షితంగా ఉందని బదులిచ్చాడు. దీనిని బట్టి భారత్‌కు ఇంకా ట్రోఫీ ఇవ్వలేదని పరోక్షంగా చెప్పారని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. అయితే పలు అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఈ ట్రోఫీని దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ కాంప్లెక్స్‌లో ఉన్న ఏసీసీ కార్యాలయంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉందని సమాచారం. కేవలం అనుమతి ఉన్న అధికారులు మాత్రమే అక్కడికి వెళ్లగలరు. ఈ వివాదం ముగిసే వరకు ఆ ట్రోఫీని భద్రత సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. మరోవైపు బీసీసీఐ, నఖ్వీ మధ్య ఈ వివాదం ఇంకా సద్దుమణగలేదు. నఖ్వీ స్వయంగా తన చేతులతోనే టీమిండియాకు ట్రోఫీ ఇవ్వాలని పట్టుబడుతుండగా, అతని చేతుల మీదుగా తీసుకోవడానికి భారత్ సిద్ధంగా లేదు. ఐసీసీ కూడా ఈ వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. మరి భారత్‌కు దక్కాల్సిన ట్రోఫీ ఎప్పుడు అందుతుందా అని అందరిలో ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.



'మన శంకరవరప్రసాద్ గారు' పండక్కి వస్తున్నారు...




మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' తో పండుగ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. ఇది అత్యంత క్రేజీ కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచింది. సినిమా ప్రమోషన్‌లు ఇప్పటికే అద్భుతంగా జరుగుతున్నాయి. ప్రతి గ్లింప్స్, పాటలు, పోస్టర్ అంచనాలను పెంచాయి. ఆదివారం, మేకర్స్ తిరుపతిలో సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఒకప్పుడు దేశ భద్రతా సంస్థల్లో కీలకంగా సేవలందించిన శంకర వర ప్రసాద్, శశిరేఖను ప్రేమించి పూర్తిగా ఫ్యామిలీ లైఫ్ కి మారుతాడు. ఫ్యామిలీ మ్యాన్ గా ప్రశాంతంగా కనిపించినా, అతనిలోని వింటేజ్ ఫైర్, నేచురల్ ఇన్‌స్టింక్ట్ మాత్రం ఎక్కడా తగ్గదు. ఆనందంగా సాగుతున్న అతని జీవితంలో అకస్మాత్తుగా సమస్యలు వచ్చినప్పుడు, వాటిని శంకర వర ప్రసాద్ తనదైన స్టైల్‌లో ఎలా ఎదుర్కొన్నాడన్నదే కథ ప్రధానాంశం. చాలా రోజుల తర్వాత మెగాస్టార్ చిరంజీవిని హిలేరియస్ రోల్‌లో చూడటం ప్రేక్షకులకు మెగా ట్రీట్ గా నిలిచింది. ఆయన గ్రేస్, స్వాగ్, కామెడీ టైమింగ్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ.. అన్నీ కలిసి ఎందుకు ఆయన 'మెగాస్టార్' అనిపించుకుంటారో మరోసారి గుర్తు చేస్తాయి. వెంకటేష్ పవర్‌ఫుల్ మాస్ ఎంట్రీ ప్రేక్షకులను ఎక్సయిట్మెంట్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. ఈ ఇద్దరు స్టార్స్ మధ్య వచ్చే కెమిస్ట్రీ, సరదా పంచ్ డైలాగ్స్ అభిమానులకు విజువల్ ఫీస్ట్‌గా నిలుస్తాయి. నయనతార సంప్రదాయంగా, ఎంతో అందంగా కనిపిస్తూ, చిరంజీవితో ఆమె కెమిస్ట్రీ ఫ్యామిలీ ఆడియన్స్‌ను బాగా కనెక్ట్ చేస్తుంది. సచిన్ ఖేడేకర్ తన పాత్రలో పూర్తిగా లీనమై నటించగా, మిగతా నటీనటులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి తన మ్యాజిక్ ని చూపించారు. మెగాస్టార్‌ను వింటేజ్, కరిష్మాటిక్ గా చూపడమే కాకుండా, వినోదం-యాక్షన్‌లను సమతూకంగా మేళవించి ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను రూపొందించారు. చిరంజీవిని అద్భుతంగా ప్రెజెంట్ చేయడం, వెంకటేష్‌ను కథలో కీలకంగా తీసుకురావడం సినిమాకు బిగ్గెస్ట్ ఎసెట్స్. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ స్టైలిష్‌గా, వైబ్రెంట్‌గా ఉండగా, భీమ్స్ సిసిరోలియో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నోస్టాల్జిక్ ఫీల్‌ను అందిస్తుంది. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ సినిమా వరల్డ్ కి మంచి రిచ్‌నెస్‌ను తీసుకొచ్చింది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు ప్రొడక్షన్ వాల్యూస్‌ను అత్యున్నతంగా వున్నాయి. మెగాస్టార్ అన్‌మ్యాచ్డ్ స్వాగ్, వింటేజ్ ఛార్మ్, అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ హిలేరియస్ కామెడీ, వెంకటేష్ ఇంపాక్ట్‌ఫుల్ ప్రెజెన్స్‌తో 'మన శంకర వర ప్రసాద్ గారు' పర్ఫెక్ట్ సంక్రాంతి ఎంటర్టైనర్‌గా కాబోతోంది. ఈ హైలీ ఎంటర్టైనింగ్ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సంక్రాంతి కానుకగా జనవరి 12న సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.



కామెడీ పంట.. జెట్లీ

'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. సత్య, రియా సింఘూ, వెన్నెల కిషోర్, అజయ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని నిర్మాత చెర్రీ తెలిపారు. 'మత్తు వదలరా' సిరీస్ తర్వాత వస్తున్న ఈ సినిమా, ప్రేక్షకులకు మరోసారి నాన్‌స్టాప్ వినోదాన్ని పంచుతుందని దర్శకుడు రితేష్ రానా ధీమా వ్యక్తం చేశారు. ఇక వేసవి కానుకగా 'జెట్లీ' థియేటర్లలో సందడి చేయనుంది.

పొలిటికల్ డ్రామా 'పరాశక్తి'



వైవిధ్యమైన కథలను ఎంచుకొనే శివకార్తికేయన్ హీరోగా నటించిన పొలిటికల్ డ్రామా 'పరాశక్తి ట్రైలర్' వచ్చేసింది. దేశభాషగా హిందీని వ్యతిరేకిస్తూ ఉమ్మడి మద్రాస్‌లో జరిగిన ఉద్యమం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు. హిందీని దేశ భాషగా ప్రకటించడం, అన్ని రాష్ట్రాలపై హిందీని రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ 1960లో తమిళనాడులో చెలరేగిన ఆందోళనల్లో విద్యార్థి నాయకుడు 'ఛెజియాన్' పాత్రలో శివకార్తికేయన్ కనిపించారు. తమ ప్రాంత ఉనికిని, తమిళ భాష ప్రత్యేకతను కాపాడుకునేందుకు జరిగిన పోరాటంలో ద్యార్థి నాయకుడ శివకార్తికేయన్ పోరాటం సాగించిన తీరు.. అధికారి తిరునాడన్ రవిమోహన్‌తో శివ కార్తికేయన్ తలపడే సన్నివేశాలతో ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఇక ఈ సినిమాతో తమిళంలో ఎంట్రీ ఇస్తున్న శ్రీలీల రేడియో అనౌన్సర్ 'రత్నమాల' పాత్రను పోషించింది. అప్పటికాలానికి తగ్గట్టుగా అందాల భామ చీరకట్టుతో తళుక్కుమంది. ఉద్యమ నేపథ్యంతో వస్తున్న సినిమాపై హైప్ పెంచేసింది. ఈ సినిమాకు 'ఆకాశమే హద్దురా' చిత్రంతో హిట్ కొట్టిన సుధా కొంగర దర్శకత్వం వహించగా, నిర్మాత ఆకాశ్ భాస్కరన్ కాగా జీవీ. ప్రకాశ్ కుమార్ సంగీత దర్శకత్వం వహించాడు. జనవరి 10వ తేదీని పరాశక్తి మూవీ థియేటర్లో విడుదల కానుంది.



వర్క్ ఫ్రమ్ హోం.. కష్టాలు

విలక్షణమైన పాత్రలతో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటుడు త్రిగుణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను చిత్ర యూనిట్ ఘనంగా విడుదల చేసింది. త్రిగుణ్ సరసన పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటించగా, ప్రముఖ నటుడు అనీష్ కురువిల్లా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం ఈ చిత్రాన్ని నిర్మించారు. CH.V.S.N బాబ్జీ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200